నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

నమ్మలేని నిజాలు

కుబేరలంక
కూటికి ప్రాకులాట
అప్పుల ఊబి.

రోగులు బలి
ఆసుపత్రిలో ఇలి
శ్రద్ధకు వెలి.

తాగి తరించు
ఆరోగ్యానికి నీర
కల్తీల కాలం.

నీటి అలభ్యం
నగరాలు మాయం
మరోచరిత్ర

భుజంపై శవం
పాలన రోడెక్కింది
కన్నీటి చిత్రం

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాలు

ఆరుగాలం చెమటోడ్చి
కష్టపడ్డవాడు రైతు!
క్రమశిక్షణ పెంపుతో
పంటగుర్రానికి రౌతు !

ఆకలి పొట్టలు నింపే
అన్న మౌను ప్రతిగింజా!
పాతిపెడితే మొక్క తొడిగి
విప్పుతుంది పులిపంజా !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ | గురువారం 14-4-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 206 | పేజీలు:6 | వెల: రూ.1/-

అంబేద్కర్ వల్లే తెలంగాణ వచ్చింది : మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 13: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే తెలంగాణ వచ్చిందని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. బేగంపేటలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో పాల్గొని మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పీవీ మార్గ్‌లో 125 అడుగుల ఎత్తులో అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. డిసెంబర్ చివరి నాటికి ఈ విగ్రహాన్ని తెలంగాణ రాష్ట్రం ఆవిష్కరించబోతోందన్నారు. భారతదేశం మొత్తం గర్వపడే విధంగా మ్యూజియం, జ్ఞానమందిరం ఏర్పాటు చేస్తున్నాం. ఇది భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవబోతుందన్నారు. అంబేద్కర్ తత్వాన్ని మాటల్లో చాలా మంది చెప్తారు. కానీ ఆ తత్వాన్ని కేసీఆర్ ఆకళింపు చేసుకుని ముందుకు సాగుతున్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఆ మహానుభావుడు అంబేద్కరే కారణమని కేటీఆర్ చెప్పారు.

ప్రపంచంలో ఉన్నవి రెండు కులాలు మాత్రమే..

దేవుడు మనిషిని పుట్టించాడు.. ఆ మనిషి కులాన్ని పుట్టించాడని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. మన దేశంలో మనషులు కలిసి ఉండే అలవాటు లేదు.. మతం, కులం పేరుతో విడిపోతున్నారు. వాస్తవం చెప్పాలంటే.. ప్రపంచంలో ఉన్నవి రెండు కులాలు మాత్రమే.. పైసలు ఉన్నోడు.. పైసలు లేనోడు. అది మాత్రం వాస్తవం. దేశంలోని అగ్రవర్ణాల్లో ఉన్న పేదలను ఎవరూ పట్టించుకోరు.

దళితుల్లో, గిరిజనుల్లో డబ్బులు ఉండి పైకి వచ్చినవారి విషయంలోనూ ఏం ఇబ్బంది ఉండదు. అందుకే డబ్బున్న వాడు.. డబ్బు లేని వాడు అనే రెండు విషయాలే ప్రధానమనేది అర్థమైందన్నారు. సృష్టించిన సంపదను సమాజంలో సమానంగా పంచగలిగితే కుల వ్యవస్థను రూపుమాపే అవకాశం ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు.

అందరి రక్తం ఒక్కటే..

దేవుడు అందర్నీ సమానంగా పుట్టించాడన్న కేటీఆర్.. ఎవరికైనా రక్తం ఎర్రగానే ఉంటుందని స్పష్టం చేశారు. కులం, ఉప కులం, మతం అని పుట్టించుకున్నది మనమే అని తెలిపారు. ఆశయం గొప్పదైతే.. అన్ని రకాలుగా ఎదగొచ్చు. తెలివి ఎవడబ్బా సొత్తు కాదు. తమకున్న తెలివిని ఉపయోగించుకుని.. భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలవాలని కేటీఆర్ సూచించారు.

అట్టడుగున ఉన్నది దళితులు మాత్రమే..

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ ప్రధాని, ఏ ముఖ్యమంత్రి దళితబంధు లాంటి కార్యక్రమాన్ని అమలు చేయలేదని కేటీఆర్ తెలిపారు. దళిత బంధు పథకం పట్ల కొంతమంది సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని ధ్వజమెత్తారు. ఈ దేశంలో అట్టడుగున ఉన్నది దళితులు మాత్రమే. అత్యంత వెనుకబడ్డ దళితులను అభివృద్ధి పథంలో నడిపించేందుకు సీఎం కేసీఆర్ దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టారు. దళిత బంధును 40 వేల మందికి అమలు చేశాం. ఈ ఏడాది 2 లక్షల మందికి ఈ పథకాన్ని అమలు చేయబోతున్నామని కేటీఆర్ తెలిపారు.

వినూత్నంగా ఆలోచిస్తేనే విజయం..

దళిత బంధు పథకం ద్వారా సంపదను సృష్టించే మార్గాలను వెతుక్కోవాలని లబ్దిదారులకు కేటీఆర్ సూచించారు. డిక్కీ సంస్థ ద్వారా ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల తయారీకి యత్నిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అవకాశాలు ఇచ్చినప్పుడు యువత అందిపుచ్చుకోవాలన్నారు. దళితబంధు లబ్దిదారులు వినూత్నంగా ఆలోచించాలి. ప్రభుత్వ రాయితీలను అందిపుచ్చుకుని అభివృద్ధి చెందాలన్నారు. అందరూ ట్రాక్టర్లు, హార్వెస్టర్లు కొంటామనడం సరికాదు. అందరూ ఒకే బాట పడితే ప్రభుత్వం కార్యక్రమం ఉద్దేశం సఫలం కాదు. దళితబంధు విఫలమైందనే నింద తెలంగాణకు మంచిదికాదన్నారు. దళితబంధు సఫలమైతే దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు.

వడ్ల సేకరణకు కార్యాచరణ రూపొందించండి.. సీఎస్ ఆదేశం

హైదరాబాద్, ఏప్రిల్ 13:యాసంగిలో పండించిన మొత్తం వరి ధాన్యాన్ని రాష్ట్రమే పూర్తిగా కొనుగోలు చేస్తుందని ముఖ్యమంత్రి కేసీఆర్ నిన్న ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వ్యవసాయ, మార్కెటింగ్, పౌరసరఫరాల శాఖ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు వడ్ల సేకరణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.

ధాన్యం కొనుగోళ్ల పురోగతిని జిల్లాల వారీగా ప్రతీ రోజూ పర్యవేక్షించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు. తక్షణమే మంత్రులు, ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి జిల్లాల్లో ధాన్యం సేకరణకు చర్యలు ప్రారంభించాలని చెప్పారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు రోజూ కనీసం నాలుగు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని ఆదేశించారు.

గతంలో కంటే అధికంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీఎస్ ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ప్రత్యేక అధికారిని నియమించి, పర్యవేక్షించాలన్నారు. గన్నీ బ్యాగుల సేకరణపై కూడా దృష్టి సారించాలని చెప్పారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఏవైనా సమస్యలు వస్తే అధికారులు వెంటనే పరిష్కరించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రవాణా చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు.

ఉక్రెయిన్ వార్.. 20 మంది జర్నలిస్టులు మృతి

కీవ్, ఏప్రిల్ 13:: ఉక్రెయిన్, రష్యా యుద్ధంలో ఇప్పటి వరకు 20 మంది జర్నలిస్టులు మృతిచెందినట్లు తెలుస్తోంది. నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఉక్రెయిన్ తన టెలిగ్రామ్ ఛానల్‌లో ఈ విషయాన్ని తెలిపింది. మృతిచెందిన జర్నలిస్టుల పేర్ల జాబితాను ఆ యూనియన్ ప్రకటించింది. ఆ మృతుల జాబితాను ప్రాసిక్యూటర్ జనరల్ ఆఫీసు ధ్రువీకరించింది. మృతిచెందిన జర్నలిస్టుల్లో విదేశీయులు ఉన్నట్లు తెలిపారు. మరో వైపు ఉక్రెయిన్‌కు మరోసారి భారీగా ఆయుధాలను అమెరికా సరఫరా చేయనున్నది. సుమారు 750 మిలియన్ల డాలర్ల ఖరీదైన ఆయుధాలను ఉక్రెయిన్‌కు ఇచ్చేందుకు వైట్‌హౌజ్ ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రాణహితా.. ప్రణమామ్యహం.. మొదలైన పుష్కరాలు

హైదరాబాద్, ఏప్రిల్ 13:। గోదావరి నదికి ప్రధాన ఉపనది, జీవనది అయిన ప్రాణహిత పుష్కరాలు మొదలయ్యాయి. చైత్రశుద్ధ ద్వాదశి ఏప్రిల్ 13 బుధవారం ఉదయం నుంచి చైత్రశుద్ధ బహుళ అష్టమి ఏప్రిల్ 24 వరకు అంటే 12 రోజులపాటు పుష్కరాలు జరగనున్నాయి. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం దేవగురు బృహస్పతి మీనరాశిలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా ప్రాణహిత నదికి పుష్కరాలు ప్రారంభమయ్యాయి. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని అర్జునగుట్ట వద్ద అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి, పుష్కర పుష్కర స్నానం చేశారు. ఆసిఫాబాద్ జిల్లా కౌటల మండలం తుమ్మిడిహేట్టి పుష్కర స్నానాల ఘాట్ల వద్ద కార్తీక మహారాజ్ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, ఘాట్ల వద్ద పుష్కర పుణ్య స్నానాలు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దంపతులు ప్రారంభించారు.

కేంద్రీయ విద్యాలయాల్లో ఎంపీ కోటా సీట్లు రద్దు చేస్తూ కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:కేంద్రీయ విద్యాలయాల్లో ఎంపీ కోటా సీట్లు రద్దు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి రాష్ట్రాలకు కేంద్రీయ విద్యాలయ సంఘటన్ సర్క్యూలర్ జారీ చేసింది. గతంలో ప్రతి ఏటా ఒక్కో ఎంపీకి 10 సీట్లు కేటాయించేవారు. ప్రవేశాల కోసం ఎంపీల కోటాను పెంచాలని ఇటీవలే డిమాండ్ వచ్చిందని, దీంతో కేంద్ర ప్రభుత్వం మొత్తం కోటానే రద్దు చేసింది. లోక్‌సభ ఎంపీలు 543 మంది, రాజ్యసభ ఎంపీలు 245 మంది కలిసి ఏటా మొత్తం 7,880 మంది విద్యార్థులకు కేంద్రీయ విద్యాలయాల్లో అడ్మిషన్లు ఇప్పిస్తున్నారు. ఎంపీల కోటాలో పారదర్శకత లోపిస్తోందనే విమర్శలు వినపడుతున్నాయి. దీంతో మొత్తం కోటానే రద్దు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.

చరిత్రలో నేటినిజం

కం॥ చూలన పటునను జూపుచు,
తిలక పాత్రల సవజించి తిత్తిన సాటపన్
పోలక మనతెలుగుల పిని
మాలంబున 'గొల్లపూడి మారుతి'చెలువున్॥

(ఏప్రిల్ 14 గొల్లపూడి మారుతీరావు జననం...)

–రాధశ్రీ
సెల్: 9494481210

సిద్ధిపేటలోనే తొలి పామాయిల్ ఫ్యాక్టరీ : హరీశ్‌రావు



సిద్ధిపేట, ఏప్రిల్ 13: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చాక మొట్టమొదటి పామాయిల్ ఫ్యాక్టరీని సిద్ధిపేటలోనే స్థాపించినట్లు రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో రూ.300కోట్లతో 60 ఎకరాల విస్తీర్ణంలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డితో కలిసి హరీశ్‌రావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ ఫెడ్ ఫ్యాక్టరీని సిద్ధిపేట జిల్లాలో ప్రారంభంకావడం సంతోషంగా ఉందన్నారు. కేసీఆర్ అపర భగీరథ ప్రయత్నంతో కాళేశ్వరం నీళ్లు తెచ్చుకున్నామన్నారు. గతంలో కిరణ్‌కుమారెడ్డి మీకు చీకటే.. కరెంటు ఎక్కడ అని అన్నారని.. ఇప్పుడు ఏపీలో చీకటి ఉందని.. సీఎం కేసీఆర్ తెలంగాణలో 24 గంటల కరెంటు ఇచ్చి చూపించారన్నారు. అలాగే ఎకరానికి రూ.10వేల పెట్టుబడి ఇచ్చారన్నారు.

వ్యవసాయం చేసే రైతులు నాలుగు డబ్బులు సంపాదిస్తే ఆనందమని, రైతులు వరి అని ఒకటే పంట వేస్తున్నరని.. కష్టపడి తెచ్చుకున్న తెలంగాణలో రైతేరాజు కావాలన్నది కేసీఆర్ కల అన్నారు. వరి వేస్తే రూ.25వేల వరకు మిగులుతుందని, కానీ రైతు ఆదాయం పెరగాలన్నదే మా తన్నులాట అన్నారు. అందు కోసమే మంత్రి నిరంజన్‌రెడ్డి సహకారంతో ఆయిల్‌పామ్ జిల్లాగా డిక్లేర్ చేయించామన్నారు. ఎకరానికి రూ.80వేల సబ్సిడీ ఇస్తు?న్నట్లు పేర్కొన్నారు. డ్రిప్ కంపెనీలకు సబ్సిడీ పెంచామన్నారు. ఖమ్మం జిల్లాకు చాలా మందిని పంపామని, కళ్లతో చూసి వచ్చారన్నారు. కోతులు, పందులు, చీడపీడ లేని పంట.. ధర రాదనే బాధ లేదన్నారు.

ఎకరానికి తక్కువలో తక్కువ రూ.1.50లక్షల వరకు నికరంగా లాభం వస్తుందన్నారు. పంట కొనేది ఆయిల్ ఫెడ్ ప్రభుత్వ సంస్థ అనీ, ఫ్యాక్టరీ మన జిల్లాలోనే ఉందన్నారు. గవర్నమెంట్ ఉద్యోగికి ఎంత జీతం వస్తదో.. ఆయిల్ పామ్ రైతుకు అంతే వస్తదని చెప్పారు. దేశం లక్షలకోట్ల విలువైన పామాయిల్‌ను దిగుమతి చేసుకుంటుందని, మన దేశంలో పండకనే ఇతర దేశాల నుంచి తెచ్చుకుంటున్నామన్నారు. నూనె పంటల సాగు దేశంలో తక్కువని, పామాయిల్‌కు మంచి డిమాండ్ ఉంటదన్నారు. రైతులు పంటలు వేస్తే బాగుపడుతారని, జూలై కల్లా 20వేల ఎకరాలకు మొక్కలు రెడీగా ఉన్నాయని, ఇప్పటికే 3వేల ఎకరాల్లో పంటవేశారన్నారు. ప్రజాప్రతినిధులు ప్రతీ మండలంలో పెద్ద ఎత్తున ఆయిల్ పామ్ తోటలు సాగు చేసేలా చర్యలు తీసుకోవాల న్నారు.

కేంద్రం తొండాట..

కేంద్రం ప్రభుత్వం తొండాట ఆడుతుందని, యాసంగి పంట అంటేనే బాయిల్డ్ రైస్ అన్నారు. రా రైస్ పట్టిస్తే నూకలు ఎక్కువ, బియ్యం తక్కువ అనీ, పండేది బాయిల్డ్ రైస్ ఇస్తమంటే.. రా రైస్ కొంటామంటున్నారన్నారు. కొంటమని చెబుతరు.. బాయిల్డ్ రైస్ కొనం అంటున్నరని.. నోటితో చెప్పి నొసటితో ఎక్కిరించినట్లు కేంద్రం వ్యవహారం ఉందని విమర్శించారు. నూకలు ఎంత ఖర్చయితే అంత రూ.2వేలకోట్లా.. రూ.3వేల కోట్ల నష్టం భరిద్దాం.. రైతును నిలబెడుదాం అని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారన్నారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సమస్య సృష్టిస్తున్నారని, తెలంగాణ పంట్ల వాళ్ల కళ్లు మండుతున్నాయన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అన్నింట్లో నెంబర్ అనీ, తలసరి ఆదాయంలో, ఆర్థిక వృద్ధిరేటులో తెలంగాణ మొదటి స్థానంలో ఉందన్నారు. 24 గంటల ఉచిత విద్యుత్, ఎకరానికి రూ.10వేలు ఇవ్వడంలో, రైతులు చనిపోతే రూ.5లక్షల బీమా ఇవ్వడంలో నెంబర్‌గా ఉందన్నారు. అత్యధిక వరి ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అన్నారు.

ఢిల్లీలోని బీజేపీ నేతలకు ఏమని తిట్టాలో అర్థం కావడం లేదని, బీజేపీ పాలిత రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణ అన్నింట్లో నెంబర్ అన్నారు. ఈర్ష్య, అభివృద్ధిని చూసి ఓర్వలేక కుట్రలు చేస్తున్నారని, అందులో ఒకటి వడ్లు అనీ, రాష్ట్రాన్ని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో అశాంతి రావాలి, తక్కువ ధరకు రైతులు అమ్ముకొని నష్టపోవాలనే ఉద్దేశం వారిదన్నారు. బీఆర్జీఎఫ్‌లో రూ.1350 కోట్లు ఇవ్వాలి.. 50 దరఖాస్తులు పెట్టినం.. ఇవ్వడం ఆపేశారు.. 15వ ఆర్థిక సంఘం గ్రాంట్లు ఇవ్వాలంటే ఇవ్వలేదని, ఇరిగేషన్ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని, అప్పులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నరని, బాయిలకాద మీటర్లు పెడితే రూ.25 వేలకోట్లు అప్పు ఇస్తామంటున్నారని ఆరోపించారు.సీఎం కేసీఆర్ బాయిలకాద మీటర్లు పెట్టేది లేదని చెప్పారని, ఇవన్నీ రైతులు దృష్టిలో ఉంచుకోవాలన్నారు. రైతుల కోసం ప్రభుత్వం పని చేస్తుందని, రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వంటి నేతలు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని, మీ పాలనలో ఒక్క మడి కూడా ఎండకుండా పంట పండిందా ? కరెంటు కోతలు, కాలిపోయే మోటర్లు, పేలిపోయే ట్రాన్స్ ఫార్మర్లున, నెర్రలు బాసిన నెలలు కనిపించేవని గుర్తు చేశారు. ఇంకా అధికారంలోకి వస్తా అంటున్నరని.. మీకు ఏం చూసి ఓటియ్యాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ అంటే చరిత్ర కోసం మాట్లాడలి తప్ప భవిష్యత్తు లేని పార్టీ అన్నారు. రైతులకు సీఎం కేసీఆర్‌పై సంపూర్ణ విశ్వాసం ఉందని, అందుకే రైతు నష్టపోవద్దని 2వేల కోట్లయినా నూకల నష్టం భరిస్తామని ప్రకటించారన్నారు.

నాలుగు స్కూళ్లలో- 23 మంది విద్యార్థులకు కరోనా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: దేశంలో మళ్లీ కరోనా కేసులు పెరుగుతున్నాయి. నాలుగు స్కూళ్లలో 23 మంది విద్యార్థులకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దేశ రాజధాని ఢిల్లీకి సమీపంలోని ఉత్తరప్రదేశ్ నోయిడాలో ఇది వెలుగుచూసింది. గత 48 గంటల్లో నోయిడాలో 54 కరోనా కేసులు నమోదయ్యాయి. వైరస్ సోకిన వారిలో చాలా వరకు స్కూలు విద్యార్థులున్నారు. ఖైతాన్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన 19 మంది విద్యార్థులు మంగళవారం కరోనా బారినపడ్డారు. దీంతో ఆ స్కూలును మూసివేసినట్లు గౌతమ్ బుద్ధనగర్ వైద్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్ శర్మ తెలిపారు. నోయిడాలో కరోనా పాజిటివ్ విద్యార్థుల సంఖ్య 23కు చేరిందని చెప్పారు. ఈ నేపథ్యంలో వైద్య సిబ్బంది సంబంధిత విద్యార్థుల ఇండ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులు, పొరుగువారికి కరోనా టెస్టులు నిర్వహిస్తున్నారని వివరించారు. కరోనా లక్షణాలు లేనప్పటికీ పరీక్షలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

మరోవైపు నోయిడాలోని సెక్టార్ 40లోని ప్రైవేట్ స్కూల్‌లో 13 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఘజియాబాద్ స్కూల్‌లో 13 ఏండ్ల విద్యార్థికి కరోనా సోకింది. ఈ నేపథ్యంలో ఘజియాబాద్, నోయిడాలో పలు ప్రైవేట్ స్కూళ్లు మూతపడ్డాయి. రెండు రోజుల పాటు భౌతిక తరగతులను రద్దు చేసి ఆన్‌లైన్ క్లాసులు నిర్వహిస్తున్నారు.

కేంద్రం పెట్టిన వడ్ల పంచాయితీ ఢిల్లీ దాకా తీసుకెళ్లాం : మంత్రి నిరంజన్‌రెడ్డి

సిద్ధిపేట, ఏప్రిల్ 13: కేంద్రం పెట్టిన వడ్ల పంచాయితీని ఢిల్లీ దాకా తీసుకెళ్లామని, రైతులపట్ల కేంద్ర ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో చెప్పేందుకే ఢిల్లీలో సీఎం కేసీఆర్ చివరి ప్రయత్నం చేశారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన సిద్ధిపేటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి మంత్రి హరీశ్‌రావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యాసంగి సీజన్‌లో రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను కొంటుందని సీఎం ప్రకటించడం అందరికీ తెలుసునన్నారు. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ నిమిషం చప్పట్లు కొట్టి సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపాలన్నారు. ఆయిల్ ఫెడ్ ద్వారా ఆయిల్‌పామ్ తోటలు విస్తరణ చేపట్టడం, మూడేళ్ల తర్వాత వచ్చే గుత్తులను ఫ్యాక్టరీకి అమ్మాల్సి ఉంటుందన్నారు. ఇందుకు ఫ్యాక్టరీ నిర్మాణం 50 ఎకరాల్లో సిద్ధిపేటలో పెట్టేందుకు మంత్రి హరీశ్‌రావు సహకారం ఇవ్వడం అభినందనీయం. రూ.300 కోట్ల వెచ్చించి ఫ్యాక్టరీని నిర్మిస్తున్నట్లు చెప్పారు.

రాష్ట్రం చూపు సిద్ధిపేట వైపు..

ప్రతీ సందర్భంలో రాష్ట్ర ప్రజానికం రెండు కారణాలతో సిద్ధిపేట వైపు చూస్తున్నారని.. సిద్ధిపేట వైపు చూస్తునారని.. రాష్ట్రంలో ఏ కొత్త పని జరిగినా అది సిద్ధిపేటలో ప్రారంభమవుతుందన్నారు. మేం ఏ తలపెట్టిన ఏం పని కావాలన్నా ఆ డబ్బులు ఇచ్చేది సిద్ధిపేట బిడ్డ సీఎం కేసీఆర్, ఆర్థిక మంత్రి హరీశ్ రావు అన్నారు. అందుకే సిద్ధిపేట ప్రాంత ప్రజలంటే మా అందరికీ గౌరవం, అభిమానమన్నారు. సిద్ధిపేటలో శంకుస్థాపన చేసిన ఆయిల్ ఫెడ్ కార్మాగారం రాబోయే పది తరాల ప్రజల జీవితాల తలరాతను మార్చే గొప్ప కార్యక్రమం అన్నారు. తెలంగాణ రైతాంగం పామాయిల్ పంట వైపు చూడకుండా పత్తి, జొన్నలు, రాగుల పంటి వాటి వైపే చూసేలా ఆనాటి పాలకులు వ్యవహరించారని, దేశంలోని ఆయా రాష్ట్రాల పంటలు, భవిష్యత్తు దృష్ట్యా సీఎం కేసీఆర్ గారు పామాయిల్ పంటను ప్రోత్సహించాలని నిర్ణయించారన్నారు. ఒక్క ఎకరా వరి బదులు నాలుగు ఎకరాల ఆయిల్ పామ్ తోటలు, నీటిని, విద్యుత్‌ను వినియోగించుకోని పంట పండించొచ్చున్నారు. మంచి పోషణ చేస్తే, జాగ్రత్తలు వహిస్తే మూడున్నర ఏళ్లు దాటగానే పంట వస్తుందని, పంట ప్రారంభం అయితే.. సంవత్సరం పొడవునా గెలలు వస్తాయని.. నెల వారీగా జీతాలు వచ్చే వారి కన్నా ఆయిల్‌పామ్ రైతులకు స్థిరమైన ఆదాయం వస్తుందన్నారు.

కొత్త వ్యవసాయ పద్ధతులు అవలంభించాలి

రాష్ట్రంలో ఖమ్మం, కొత్తగూడెం, సూర్యాపేట జిల్లాల్లో సుమారు 59 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటలు ఉన్నాయని, ఆయిల్ పామ్ టన్నుకు రూ.22 వేల రూపాయలు ధర రైతుకు వస్తోంది. పెట్టుబడి ఖర్చు పోగా ఎకరానికి రూ.1.50లక్షల వరకు ప్రస్తుతం లాభం వస్తోందన్నారు.

డిసెంబర్‌లోగా అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టిస్తాం : మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 13:హైదరాబాద్‌లోని పీవీ మార్గ్‌లో ఏర్పాటు చేస్తున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఈ ఏడాది డిసెంబర్ లోగా ప్రతిష్టిస్తామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. పీవీ మార్గ్‌లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహా పనులను కేటీఆర్ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. గత 8 నెలలుగా అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ నేతృత్వంలో పనులను ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నారని పేర్కొన్నారు. అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు దేశానికే తలమానికంగా నిలవనున్నది. పర్యాటక రంగాన్ని ఆకర్షించేలా మ్యూజియం ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో పర్యాటక రంగం పుంజుకుంటుందని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను సీఎం కేసీఆర్ కొనసాగిస్తున్నారని చెప్పారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే తెలంగాణ సాధ్యమైందని మంత్రి స్పష్టం చేశారు. అంబేద్కర్ ఆశయాలు దేశంలో అమలు కావాల్సిన అవసరం ఉందన్నారు. ఆ మహనీయుడు కలలుగన్నట్టు అందరికీ మేలు జరగాలని కేటీఆర్ పేర్కొన్నారు.

మాది రైతు ప్రభుత్వం.. మోదీది కార్పొరేట్ల ప్రభుత్వం : ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, ఏప్రిల్ 13: కేంద్ర ప్రభుత్వంపై టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మరోసారి నిప్పులు చెరిగారు. న్యూస్ ఏజెన్సీ ఏఎన్ఐతో కవిత మాట్లాడుతూ.. మాది రైతు ప్రభుత్వం అని తేల్చిచెప్పారు. మోదీ కార్పొరేట్లకు అనుకూల నిర్ణయాలు తీసుకుంటున్నారని మండిపడ్డారు. రైతులను మోదీ గాలికి వదిలేస్తే.. కేసీఆర్ మాత్రం రైతులకు అండగా నిలబడ్డారని స్పష్టం చేశారు.

దేశానికి అందించే బియ్యంలో తెలంగాణ నుంచే 40 శాతం ఉన్నాయని తెలిపారు. ఈ క్రమంలో రైస్ బౌల్ ఆఫ్ ఇండియాగా తెలంగాణ నిలిచిందన్నారు. తెలంగాణ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఢిల్లీలో ధర్నాం చేశాం. కానీ కేంద్రం నుంచి స్పందన రాలేదన్నారు. ఈ క్రమంలో యాసంగింలో పండించిన వరి ధాన్యాన్ని టీఆర్ఎస్ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని సీఎం కేసీఆర్ నిన్న ప్రకటించిన విషయాన్ని కవిత గుర్తు చేశారు.

ధాన్యం కొనుగోళ్లపై మంత్రి ఎర్రబెల్లి సమీక్ష

హైదరాబాద్, ఏప్రిల్ 13: ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జనగామ కలెక్టరేట్ బుధవారం రైస్‌మిల్లర్లు, జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. యాసంగి సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం సేకరించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించిన నేపథ్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత కష్ట, క్లిష్ట సమయంలోనూ సీఎం కేసీఆర్ ధాన్యం కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చారన్నారు. రూ.3వేల కోట్

నేటినిజం
సాహితీ కిరణాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 14-4-2022

ఘంటారవం

కలాన్ని కదిలించడమే
కర్తవ్యమని అనుకోకు
సమాజాన్ని కదిలించేదే
సాహిత్యమని మరువకు

మారేవారే లేరని
కారాలు మిరాయలు నూరకు
మార్కుకు మూలం
మనమేనని మరువకు

వ్యయానికి మించిన ఆదాయం
ఉన్నవాడు కుబేరుడు
ఆదాయానికి మించిన వ్యయం
ఉన్నవాడు కుచేలుడు.

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

కాళేశ్వరానికి దారేది?

ఛత్రపతి శివాజి అంతర్జాతీయ విమానాశ్రయం, సహార్ లో దిగిన ఎల్లప్ప, బయటికి రాలేక పోయాడు. అలా అని అతనేదోసామాను స్మగుల్ చేశాడనుకుంటే, మీరు పప్పులో కాలేసినట్టే. కరోనా వైరస్ పరీక్షలో పాజిటివ్ అని తేలడం వల్ల, అతన్ని లోపలి నుంచే మరోల్ లోని సెవెన్ హిల్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పద్నాలుగు రోజులు క్వారంటైన్ లో ఉండి, చికిత్స చేసుకోవాలని కఠిన నిబంధన.

ఆస్పత్రి గదిలోకి చేరిన ఎల్లప్ప తలపట్టుకున్నాడు. 'దుబాయ్ కెళ్లి సక్కగ ఐద్రాబాద్ పోక, వర్లి బీ.డీ.డీ. చాల్లోని తన మేనల్లుడి పుట్టిన రోజుకని ముంబయి అచ్చినందుకు మంచి సిచ్చ యేసినవు బగవంతుడా' అని వాపోయాడు. ఐతే హైద్రాబాద్ లో కూడా కరోనా వైరస్ పరీక్షలు జరుగుతున్న సంగతి ఎల్లప్పకు తెలియదు. తన గ్రహచారం అనిసమాధానపడి, మొబైల్ లో తన మేనల్లుడికి సంగతి వివరించి, సామాజిక మాధ్యమాల్లో ఆడుకోవడం మొదలుపెట్టాడు.

దాదాపు గంట తర్వాత, విసుగనిపించి, మొబైల్ చార్జింగ్ లో పెట్టి నిద్రకుపక్రమించాడు. నిద్రాదేవి కరుణించనంది. అతని మనసు గతంలోకి పయనించింది.

ఎల్లప్ప ముంబయిలోని ఓ బట్టల మిల్లులో నేతగానిగా పని చేసేవాడు. దాదాపు ముప్పై ఎనిమిదేండ్ల క్రితం, డా. దత్తా సామంత్ ఆధ్వర్యంలో రెండు సంవత్సరాలకు పైగా సాగిన బట్టల మిల్లుల సమ్మె వల్ల, మిగతా ఎనభై మిల్లులతో పాటు, అతను పనిచేస్తున్న 'కమల మిల్లు' కూడా మూసేశారు. ముంబయిలోని వస్త్ర పరిశ్రమ కుదేలయింది. మిల్లులున్న ప్రాంతాలూ రియల్ ఎస్టేట్ కు ఆలవాలమయ్యాయి ముంబయిలోగాని, తన తెలంగాణాలో గాని ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఎల్లప్ప, దుబాయ్ బాట పట్టాడు. అప్పుడక్కడ వృత్తి కార్మికులకు మంచి డిమాండ్ ఉండేది. అనతి కాలంలోనే, తన కులవృత్తి వడ్రంగంలో మంచి నైపుణ్యం సంపాదించాడతను. సంపాదన కూడా బాగానే ఉండింది. అతను పొదుపు చేసిన మొత్తం వెంటది వెంట భార్యకు పంపడతో ఆమె, వారి ఊళ్ళో సొంత ఇల్లు కట్టించడమే కాక, ఐదెకరాల పొలం కూడా కొన్నది. అదిప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంతంలో ఉంది.

రాను రాను ఇతర దేశాల నుండి తక్కువ కూలీకి జనాలు రావడం పెరిగినకొద్దీ దుబాయ్ లో జీతాలు తగ్గిపోయాయి.

కాంట్రాక్ట్ పనులు గిట్టుబాటు కాకపోవడంతో, ఎల్లప్ప పనిచేసిన బ్రిటీష్ కంపెనీ దుబాయ్ నుండి బిచానా ఎత్తేసింది.

ఎల్లప్పకు ఆజాద్ విసా ఉండడంతో అతను ఇంకో కాంట్రాక్టర్ దగ్గర, తనకు అంతకు ముందున్న జీతంకంటే చాలా తక్కువ జీతంకు కుదురుకున్నాడు. ఓ సంవత్సరం అయ్యేసరికి కొత్త కాంట్రాక్టర్, పొమ్మనలేక పొగపెట్టడం మొదలు పెట్టాడు. ఆ యాతన తట్టుకోలేక, కుటుంబం నుండి దూరం ఉన్నది చాలు, సొంత ఊళ్లో వ్యవసాయం చేసుకునైనా బతకొచ్చనే ఉద్దేశ్యంతో ఈ ప్రయాణం పెట్టుకున్నాడతను. కాళేశ్వరం ప్రాజెక్టుకు నీళ్లు వచ్చిన సందర్భం, అతని ఆలోచనకు ఊతం ఇచ్చింది. కరోనా పుణ్యమా అని ముంబయిలో చుక్కెదురైంది. అలా ఆలోచిస్తూ ఎల్లప్ప, నిద్రలోకి జారుకున్నాడు.

చాలా కష్టం మీద, పద్నాలుగు రోజుల క్వారంటైన్ ముగిసింది. ఆ వ్యవధి చివరలో, రెండు రోజుల అంతరంతో చేసిన టెస్ట్ లు, అదృష్టవశాత్తు నెగెటివ్ అని వచ్చాయి. 'బతుకు జీవుడా' అని ఎల్లప్ప, ఆస్పత్రి నుండి

ఇతర దేశాల నుండి తక్కువ కూలీకి జనాలు రావడం పెరిగినకొద్దీ దుబాయ్ లో జీతాలు తగ్గిపోయాయి.

బయట పడ్డాడు.

బయటికి వచ్చి చూస్తే ఏముంది? ఆటోలు లేవు. బస్సులు లేవు. మెట్రో, లోకల్ (సబర్బన్) రైళ్లు కూడా బంద్.

మహారాష్ట్రంతటా కర్ఫ్ వ్యూ విధించారు. మహారాష్ట్ర- తెలంగాణ సరిహద్దులు మూసేశారు. జిల్లాల సరిహద్దులు సీల్ చేశారు. ఇదేం తిప్పలురా భగవంతుడా! అని ఎల్లప్ప, ఆస్పత్రి బయట ఓ మూల, తన సామాను పెట్టుకుని కాళేశ్వరానికి దారేదీ? అని ఆలోచనలో పడ్డాడు. ' ఈ పరిస్థితిలో తన మేనల్లుని ఇంటికి పోవడం మూర్ఖత్వం అవుతుంది. నేరుగా తమ ఊరికి పోవడమే ఉత్తమం. కాని ఎలా?' ఓ పెద్ద ప్రశ్న అతన్ని అతలాకుతలం చేసింది. అంతలో తన క్వారంటైన్ గదిలో సేవ చేసిన వార్డ్ బాయ్ కనిపించాడు. అతన్ని పిలిచి తన గోడు వినిపించాడు ఎల్లప్ప. అతను ఎవరికో ఫోన్ చేసి కనుక్కుంటే, ఓ వెలుగు కనిపించింది. ఐతే అది అంత ఆధారపడ్డ దగ్గది కాదు. ప్రమాదం తో కూడుకున్నది. పైగా చాల డబ్బు వెచ్చించాలి. కర్ఫ్ వ్యూ విధించి, జిల్లాల సరిహద్దులు కూడా సీల్ చేసిన సందర్భంలో, సాధారణంగా ఏ టాక్సీవాలా ప్రయాణానికి సాహసించడు. కాని, ఆ వార్డ్ బాయ్ పక్కింటి ప్రైవేట్ టాక్సీ ఓనరు, కిరాయిలు లేక, చాలా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడు. అతను మామూలు కంటే మూడింతల బాడుగకు, తన కార్లో ఎల్లప్పను, అతని ఊరు చేర్చడానికి ఒప్పుకున్నాడు. ఎల్లప్ప మనసులో 'గరజూకో అక్కల్ నహీ' (అవసరార్థికి తెలివుండదు) అనుకుని, టాక్సీవాలా చెప్పిన బాడుగకు ఒప్పుకున్నాడు. తన మేనల్లుడికి, వాళ్లింటికి రావడం లేదని చెప్పి, ఓ గంటలో భోంచేసి, ప్రైవేట్ టాక్సీలో తన ఊరికి బయల్దేరాడతను.

జిల్లా, జిల్లాకు ఉన్న చెక్ పోస్టుల్లో మళ్ళీ తనిఖీలు, ఆరాలు. కొన్ని చోట్ల బామాలి, బతిమాలి, కొన్ని చోట్ల మధుపులు చెల్లించి, ఎలాగోలాగ మర్నాడుదయం నాందేడ్ చేరుకున్నాడు ఎల్లప్ప. అక్కడ ఓ హోటల్లో కాలకృత్యాలు తీర్చుకుని, అతనూ డ్రైవర్, టిఫిన్ చేసి ముందుకు సాగారు.

మళ్లీ నాందేడ్ చెక్ పోస్ట్ దగ్గర చుక్కెదురైంది. మహారాష్ట్ర వాహనం తెలంగాణాకు పోవడానికి అనుమతి ఇవ్వమంటే, ఇవ్వమని, అక్కడి అధికారులు భీష్మించుకు కూర్చున్నారు. బతిమిలాటకు గాని, డబ్బులకు గాని అస్సలు లొంగలేదు.

ఎక్కువ వాదిస్తే బొక్కలోకి తోస్తామని బెదిరించారు. గత్యంతరంలేని పరిస్థితుల్లో, తాను వచ్చిన టాక్సీకి అనుకున్న మొత్తం కిరాయి చెల్లించి, తిప్పి పంపాడు ఎల్లప్ప. ఆ రోజుకతను నాందేడ్ లోని ఓ హోటల్లో బస చేశాడు.

సర్దార్జీ ఐన ఆ హోటల్ యజమానికి తన పరిస్థితి వివరించి, ఎలాగైనా తనను తెలంగాణ చేర్చమని వేడుకున్నాడు ఎల్లప్ప. సానుకూలంగా స్పందించాడు ఆ సర్దార్జీ.

మర్నాడు నిజామాబాద్ నుండి సరుకులతో వచ్చిన ఓ టెంపోలో, ఎల్లప్ప సూట్ కేసులను సరుకుల మధ్య దాచిపెట్టి, అతన్ని క్లీనరుగా మార్చాడు టెంపో డ్రైవర్. దానికతను తీసుకున్న మొత్తం తక్కువేమీ కాదు. ఐనా ఎల్లప్ప తలవంచాడు.

నిజామాబాద్ నుండి తమ ఊరు వెళ్ళే సమస్య మళ్లీ ఎల్లప్పకు ఎదురైంది. తెలంగాణ ప్రభుత్వం మొత్తం రాష్ట్రంలో లాక్ డౌన్ ప్రకటించింది. ఆటోలు, బస్సులు అన్నీ బంద్. అక్కడి ఓ మిత్రునికి ఫోన్ చేస్తే పరిష్కారం దొరికింది. ఓ డాక్టర్ ప్రైవేట్ కారు

ఏర్పాటైంది. ఇంకో డ్రైవర్ ని కూడా కుదిర్చాడు ఆ మిత్రుడు. డీజిల్ నింపుకుని, తన ఊరు చేరింతర్వాత మళ్లీ ట్యాంక్ ఫుల్ చేయించి పంపాలని శరతు. చెక్ పోస్టుల్లో ముడుపులు, టోల్ చార్జీలు ఎల్లప్పే భరించాలి. అంతే గాక, డ్రైవర్ కు భోజనసదుపాయంతో పాటు, వేయి రూపాయలు భత్తా చెల్లించాలి. 'గరజూకో అక్కల్ నహీ' ఎల్లప్ప మనసు మళ్లీ మూలిగింది.

'తాను రెన్నెళ్లు కష్టపడి సంపాదించిన జీతం, ముంబయి నుండి తన ఊరుకు చేరే సరికి హాం ఫట్ అయ్యేట్టుందే' అని లోలోపల వాపోయాడతను.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెక్ పోస్ట్ లో చివరి ఆమ్యామ్యా కు తిలోదకం వదిలి, ఎలాగైతేనేం తన ఇల్లు చేరాడు

ఎల్లప్ప. శార్వరి ఉగాదికి ఒకరోజు ముందే తన భార్యా పిల్లల్ని కలుసుకున్న ఆనందంలో తను పడ్డ శ్రమ, వెచ్చించిన డబ్బు,అన్నీ హుష్ కాకయ్యాయి. అతని జీవితంలో ఓ కొత్త అధ్యాయం మొదలైంది.

-అంబల్ల జనార్దన్
8850349858

పాడే పాటలా



శుభాకాంక్షల వెల్లువతో
వేకువ పరిమళ భరితం !
సుతిమెత్తని పూలవానలా
స్నేహితాల పలకరింపులు !
క్రమం తప్పని కాలగతి
తెచ్చి నిలిపింది
కంటిముందు కొత్తవత్సరాన్ని
కళకళలాడే పచ్చని ప్రకృతిలా
పరవశాన పాడే పాటలా !

వెనుకకి తిరిగి చూస్తే
ఏదో తెలియని వింత గుబులు !
గతాన గేలి చేసిన ఒడిదుడుకులు
తరుముకొస్తున్న భ్రాంతి !
ఎదరకి చూపు సారిస్తే
ఎరుకలేని ప్రశ్నావళి !
సాగిన దూరం అత్యల్పం !
సాగించవలసిన యానం ఆ కొస వరకూ
ఊపిరి ఉన్నంతవరకూ !
ఔను కదా గెలుపు ఓటముల కలయికే జీవితం
గెలుపుకి గర్వపడక ఓటమికి క్రుంగిపోక
స్వాగతం పలకాలి నూతన సంవత్సరానికి

-తమిరిశ జానకి
9441187182

జీవన వేదం

ఒక్కమాట చాలు కదా వేలవేల సూర్యచంద్రులు
వెలుగులు చిమ్మే పాలపుంతలూ
మనసు ప్రాంగణాన మచ్చిక చేసుకున్న కుక్కపిల్లల్లా
కనికట్టు చేసి కట్టిపడేసుకుందుకు

ఎప్పుడో పోగేసుకు పదిలంగా దాచుకున్న
అక్షర నిధులు సంచులకు సంచులు భుజాన వేసుకు
మధుమాసపు జాబిలి పూరెక్కల మధ్య మధువొలికినట్టు
కలల మాధుర్యాన్ని కలవరించేందుకు
కళ వరించేందుకు

జీవన పరిమళాలు వంతెనలుగా పరచుకు
యుగాల తొలిదినం నుండే
అన్వేషణ పయనంలో
ఒకరినొకరు పునః పరిచయం చేసుకుంటూ
పరిణయ గాథలు రాసుకుంటూ
ఒకే రాగం ఆలపిస్తూ
ఈ దాగుడుమూతల ఆటలో
ఒకరికొకరు దొరికిపోడం
ఇదే కదా ఒక జీవన వేదం

-స్వాతీ శ్రీపాద
8297248988

బహిష్కరణ

ఒకప్పుడు
చాలా రోజులు శ్వేతపత్రాలే
హృదయాలన్నీ
నిర్మలమైన నీటి కొలనులు.

భూతద్దపు జూమింగ్ లేని
సాధారణ సాదాసీదా రోజులవి
రంగులన్నీ పక్కపక్కనే కూర్చుని
బాంధవ్యాలుగా పరిఢవిల్లిన రోజులు.

కాలానికిపుడు
నారింజ రంగు కిరణాల సుస్తీ.

ఈ రోజులు
మారిన కృత్రిమ రోజులు
నోటికాడి ముద్దను లాగేసే
కుట్రల రోజులు.

వింతైన కథనంలా
ఫ్రంట్ పేజ్ బ్యానర్ లో
మనిషితనం సిగ్గుపడేలా
మానవత్వం పరిమళించిన వార్తలు

విశాల నేత్రంతో చదివే రోజులు
మనసు లోతుల్లో
ఆశ్చర్యార్థకాలు పెల్లుబికే రోజులు.

శీర్షికలలో
విడ్డూరపు అలంకారాలు
పేరాలలో
మతసామరస్యపు నీతి వాక్యాలు

పేజీ తిప్పితే.?
ఐకమత్యమే
ఆత్మహత్య చేసుకుంటుంది
ఒకరిది వ్యాపార బహిష్కరణ
అత్యాచార బెదిరింపు మరొకరిది
పిలుపులన్నీ జాతినుద్దేశించే

ఒట్టు
వారు ప్రజాప్రతినిధులే

-నస్రీన్ ఖాన్
సెల్:9652432981

రెక్కలు

తప్పుకో
నీ దారి
ఇన్నివేల
దారుల మధ్య
నీ వ్యక్తిత్వం-
నీ దారే.

ప్రపంచాన్ని
జయించిన వాడైనా
ప్రకృతి ముందు
నిస్సహాయుడే
అజేయి-
ప్రకృతి

ఈ క్షణం
నాది
మరుక్షణం
నీది.
అక్షరం-
అందరిదీ.

-పి.శ్రీనివాస్ గౌడ్
9949429449

బుధవారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా॥కె.వి. రమణాచారి క్యాంపు కార్యాలయంలో కర్నాటి రఘురాములు గౌడ్ రచన "శ్రీపురం శ్రీరంగ నాయకం' ఖండ కావ్యం ఆవిష్కరించిన డా॥కె.వి.రమణాచారి. వేదికపై బడేసాబ్, బైస దేవదాసు, కర్నాటి రఘురాములు గౌడ్, రామకృష్ణ చంద్రమౌళి తదితరులు.

ఒక స్త్రీ మూర్తి అంతర్జ్వలనమ్- 'పృథ'

ప్రాచీన కావ్యాలను,పురాణాలను మారుతున్న కాలం లో వర్తమాన సామాజిక విలువల నేపథ్యంలోంచీ పునర్మూల్యాంకనం చేసుకుంటూ ముందుకు సాగాలి అన్నారు విజ్ఞులు.

భారత,భాగవత,రామాయణ కావ్యాలు కూడా ఇందుకు మినహాయింపు కాదు.నిత్యం మనచుట్టూ విస్తరిస్తూ, కల్లోల పరుస్తూ, మనల్ని వేదనకు గురిచేస్తున్న విధ్వంసాల్ని తట్టుకుని నిలబడటమే

ఒక సాహసం.ఈ క్రమంలో వస్తున్న అనేకానేక సామాజిక మార్పుల్ని అనివార్యం గానో అయిష్టంగానో అంగీకరిస్తున్న

జీవితాలు మనవి.

ప్రాచీన పాత్రల్ని ఆధునిక రచనలు పునర్వ్యాఖ్య చేసేటప్పుడు జాగ్రత్త అవసరం. ఆ వ్యాఖ్యలు లేదా కల్పనలు వాస్తవ భూమిక మీద ఆయాపాత్రల అంతరంగాన్ని ఆవిష్కరించే లాగా, సానుకూలంగా ఉండాలి. మూలచ్ఛేదం చెయ్యకూడదంటారు డా.పాపినేని శివశంకర్ (16.10.2017 ఆంధ్రజ్యోతి వివిధలో మహాభారతం లో ద్రౌపది అంతరంగాన్ని విశ్లేషిస్తూ..)

"అహల్యా ద్రౌపదీ కుంతీ తారా మండోదరీ తథా
పంచకన్యా స్మరేన్నిత్యం,మహాపాతక నాశనమ్"

ఈ పంచ కన్యల్లో"కుంతి" పాత్ర మన కవయిత్రి రేణుకా అయోలా గారిని బాగా సంఘర్షణకు గురిచేస్తూ వచ్చింది. భారతంలో కుంతి,మాద్రి పాత్రలు తన్ను బాగా ఆలోచనలో పడేసిన స్త్రీలుగా వారు చెప్పుకున్నారు .

మహా భారత పాత్రల స్వభావాన్ని డా.భైరప్ప గారు కన్నడ భాషలో రచించిన 'పర్వ' నవల,ఆ తర్వాత ఇదే నవలని డా.గంగిశెట్టిలక్ష్మి నారాయణ గారు తెలుగు లోకి అనువదించడంతో తన ఆలోచనలను మరింతగా పరిపుష్టం చేశాయని కూడా చెప్పుకొచ్చారు.

అందుకే కుంతి అసలు పేరైన పృథ సంకేతంగా 'పృథ' ఒక అన్వేషణ గమనం గా దీర్ఘ కావ్యమై అవతరించింది.తన ఆలోచనా అన్వేషణా మగ్నతలో సాగిన ఈ కావ్యం ఒక స్త్రీ మూర్తి కురువంశం కోసం చేసిన త్యాగం,ఆ త్యాగం వెనుక ఆమెఎంతటి తీవ్ర మానసిక వేదనకు కవితాత్మక రూపమేఈ 'పృథ'

నిజానికిది తర తరాలు గా మనం అనుభవిస్తూన్న సామాజిక దుర్నీతి కి ఈ కావ్యం రన్నింగ్ కామెంటరీ లాంటిదే.

నిజానికి అనాదిగా ఈ కర్మభూమిలో తన జీవితం స్త్రీల చేత ఎప్పుడూ అవమానింపబడని పురుషులు ఉంటారు కానీ పురుషుల చేత ఎన్నడూ అవమానం పొందని స్త్రీలు మాత్రం ఉండరు.

మహా భారతంలో కుంతి ఎక్కడా తన ధిక్కారస్వరం విన్పించదు.తనదైన స్వతంత్ర భావ ప్రకటన చెయ్యదు.ఇప్పటికీ ఆమె గాయాల సలపరింపు

త్యాగాల వేదన ఈ రచయిత్రిని



వెంటాడుతూనే ఉందని చెప్పడానికే ఈ 'పృథ' ఒక అన్వేషణ.

సహజంగానే వస్తువుతో తాదాత్మ్యం చెందే అను భూతి ప్రియత్వం రేణుకా అయోలా గారి కవిత్వం.గతంలో వచ్చిన వారి కవితా సంపుటాలన్నీ

ఇలాంటివే.మూడవ మనిషి దీర్ఘకావ్యం కూడా మనలో ఒకడు గా మెలగ లేని థర్డ్ జెండర్ యొక్క మానసిక వ్యథ ను చిక్కగా కవిత్వం చేశారు అయోలా గారు.

పృథ వారికిది మరో మలుపనే చెప్పాలి.

తడిమింది.

ముందుచూపు లేని పిచ్చిలో కాలం తొమ్మిది నెలలు మోసుకొచ్చింది

కాలం తీర్పు కంటే రాచరికపు శాసనం బలీయమైనది, చేజారిన స్వప్నాలు రాలిపోతాయి..

ఎంతో నిర్దయగా కొన్ని పూలని దీపం పడవని నదిలో వదిలినట్లు పసిబిడ్డను వదిలేయగానే న్యాయం జరిగినట్టేనా?

పుట:22

ఒక్కోసారి కొన్ని మాటలు జీవితం కింద మంట పెడతాయి ఆ మంటల్లో కాలిపోయిన ఒక హృదయం సమాజానికి అద్దం లా నిలబడుతుంది

కురువంశంలో
మగవాడి బలం
మీద నమ్మకం
గుడ్డి చూపులో అనంతమైన గర్వం
అసంకల్పిత దుఃఖ దొంతర లో
బీజం కట్టని క్షేత్రం వొణికి
ఖాళీ కడుపు మంట ఆర్పుకోలేని
నది అయింది
ఆమె గాయాలతో ఎవరికీ
సంబంధం లేదు
పుట:37

పిల్లలు పుట్టించలేని రాజు తనను గట్టు అంచున వదిలేశాడు. అంతః పుర పరదాల్లోకి మాద్రి యవ్వనం ప్రవేశించింది.

మిగిలిన శూన్యమంతా తానై
కూలిన మాద్రి
తోట అంతా తిరిగొచ్చిన

ప్రపంచం నిన్ను వదిలేసినా చెప్పాల్సింది చెప్పాలి..కుంతి

అంతర్మథనం

ఓ చిన్న బీజం నాటుకోవాలి అంటే నా దహంతో నేనే యుద్ధం చేయాలి అనుకుంటున్న కుంతి అడుగుతోంది

గాయలమీద లేపనాలు,పసరు పూతలు మాద్రి నిస్సహాయత చూసింది కుంతి.

సతీసహగమన వేదనలో కొలిమిలా మండి పోయిన మాద్రి ని తలుచుకొని తల్లడిల్లి పోయింది.

దేవలోకంలో వైధవ్య రహిత జీవితాన్ని వదులుకొని మంచుకొండల్లో తప్పిపోయి జీవితం తెలుసుకునే అర్హత కోల్పోయి ఐదుగురు పిల్లల కన్నీళ్ళకి తడి కట్టి హస్తినాపుర జీవిత ప్రయాణంలో జీవితం ముగిసింది లేదు బతికింది లేదు కేవలం సమాధి కట్టబడింది

పుట:84

ఒకనాటి మాతృస్వామ్యం, ఈ నాటి పితృస్వామ్యం స్త్రీని కట్టుబానిగానే చూసింది.వరాలు,శాపాలు,భవిష్యత్ దర్శనం కింద నలిగి పోయిన

ఒక స్త్రీ మూర్తి కుంతి మానసిక భావోద్వేగాన్ని 'పృథ' ఎంతో ఆర్ద్రంగా వినిపిస్తుంది.

రాచరిక హద్దుల పరదాలు వెనుక జరిగే శృంగార పౌరుషంలో భంగపడి ఓడిపోయిన రాజు వాస్తవం రాజ్యానికి తెలియకుండా అంతః పుర గోడలు అడ్డుకుంటాయి.

ఎవరికో ఇచ్చేదేహం మంటలో
పచ్చటి బీజం నాటు కోవాలి
కోరిక పగుళ్ళతో
రక్తం ఓడుతున్న మనసు ఆక్రోశిస్తోంది ..

ఇదీ కుంతి మానసిక స్థితి.

ఒకే వస్తువును పైగా భారత కాలం నాటి స్త్రీపాత్రను, పాత్రౌచిత్యానికి భంగం కలగని రీతిలో ఆద్యంతం చక్కటి అభివ్యక్తితో కవితాత్మకంగా నడిపించడం కవయిత్రి రేణుకా అయోలా గారికే చెల్లింది.

కథనాత్మకంగా సాగిన వ్యాఖ్యానం సాదా సీదాగా

అన్పించినా కుంతి

అంతరంగ, మానసిక, నిర్వేదం లో పలికిన

కవిత్వం మాత్రం పఠితను

కదిలిస్తుంది.కుంతి పాత్ర ఔన్నత్యాన్ని చాటుతుంది

ఒక చారిత్రక సత్యాన్ని స్త్రీ దృక్కోణం లో వర్తమాన సామాజిక వాస్తవంగా మలిచిన తీరు ప్రశంసనీయం.

ఒక దీర్ఘ కావ్యానికిఉండ వలసిన స్పష్టత, అభివ్యక్తి,శిల్పం పరిధి దాటలేదు.

ఒక మంచి కావ్యాన్ని చదివిన తృప్తి నాకు కలిగించినందుకు కవయిత్రికి అభినందనలు,

-డా. ఉమ్మడిశెట్టి రాధేయ
సెల్:9985171411

రేణుక అయోల రచన "వృథ ఒక అన్వేషణ' దీర్ఘ కవితపై ప్రముఖ కవి రాధేయ స్పందన

మొదట గా కుంతి బాల్య యవ్వన నేపథ్యంలోకి మనల్ని నడిపిస్తారు.

అందమైన దేహం చుట్టూ కథ
కథ చుట్టూ నమ్మకాలూ బానిసత్వాలూ
చరిత్ర జాతరలో వంశం కోసం
తెచ్చుకున్న బలమైన
పెయ్యి దూడలు ఆడవాళ్లు
ఆమె చరిత్ర ద్వారాలు బార్లా
తెరిచి స్పష్టంగానే చెపుతోంది..
పుట:12

రాచరికపు మర్యాద దాటలేదు.

తండ్రి తనపై పెట్టిన బాధ్యత మరువలేదు

ఊహించని మలుపు లో జీవితం చిక్కుబడింది.

మనిషి గా వచ్చిన మగవాడు

వయసుని అనుభవించే ఆనందంలో ఉన్నాడు

మీ దేహం నా బీజం వేయాల్సిందే అంటాడు

తీరిపోయిన కోరిక వెట్టు ఎక్కి వెళ్ళిపోయాడు
పుట:20

మాతృవాసన అయోమయంగా శరీరాన్ని సీతాకోకచిలుకలా

తన బాధనంతా చెప్పుకొంటూ కుంతి ఒడిలో ముడుచుకుని పడుకుంది
పుట:47

పొడి మేఘాలకి ఎంత రాపిడి కల్గించినా నిప్పులే కానీ నీళ్లుండవని

తేలిపోయింది.జారి పోయిన మనస్సుతో కుంతి కౌగిలి లో పాండురాజు వెక్కి వెక్కి ఏడ్చాడు పాండురాజు..

ఒంటరి గా అలసటగా మట్టినేలమీద పడుకుని ఎప్పటికైనా నా ఈ జన్మ రహస్యాన్ని చెప్పుకోగలనా?

చూడు ఈ జీవితం ఎన్ని రహదారులను సృష్టించి వదిలేసిందో ఎండ వేసిన అద్దంలో కనపడిన రూపాన్ని కోపగిస్తూ అడుగుతోంది ..

ముసురుతున్న వాడి లేత జ్ఞాపకం మెరిసే కళ్ళ నున్నని బుగ్గలు

నదిలో అనాధగా ప్రవహిస్తూ ఏడుస్తూ కదిలే ఆ పసిబాలుడి కథ ఎప్పటికైనా చెప్పుకోగలనా?

దుఃఖపు పొరతో మసకబారుతున్న ప్రతిబింబం కుంతితో పోట్లాడుతోంది
పుట:63

'నగ్నధ్వని' కవితా సంపుటి ఆవిష్కరణ

'నగ్నధ్వని' కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న కొలకలూరి ఇనాక్, డా॥ఏనుగు నరసింహారెడ్డి, మాయకుంట్ల నారాయణరెడ్డి, రఘుశ్రీ డా॥నోరి రాజేశ్వర రావు, కళా జనార్థనమూర్తి తదితరులు.

శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్ శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రాత్రి కళా సుబ్బారావు కళావేదికలో ప్రముఖ కవి మాయకుంట్ల నారాయణరెడ్డి రచించిన 'నగ్నధ్వని' (అశ్వాలు) కవితా సంపుటి ఆవిష్కరణ సభను నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ కులపతి, సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ ముందుగా నగ్నధ్వని (అశ్వాలు) కవితా సంపుటిని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో కూడా కవి నారాయణరెడ్డి సామాజిక స్పృహతో చాలా కవితలు రాశారని, ఆయన రాసిన కవితలు వాస్తవిక జీవితానికి దర్పణం అని అన్నారు. ఈ సంపుటిలో ఉన్న ప్రతి కవిత మన హృదయాన్ని దోచుకుంటుందని ఆయన పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన మేధ్రల్ అదనపు జిల్లా కలెక్టర్ డా॥ ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ... ఒక కవిగా నారాయణరెడ్డి తన జీవిత ప్రస్థానాన్ని ప్రారంభించి తెలుగు సాహిత్యంలో తన రచనలతో సరికొత్త ప్రయోగాలు చేస్తున్న అక్షర శిల్పి అని అన్నారు. ఈ సభలో సాహితీవేత్తలు రమణ వెలమకన్ని, విద్యావేత్త డాక్టర్ నోరి రాజేశ్వరరావు, పెద్దూరి వెంకటదాసు వీరంతా నగ్నధ్వని కవితా సంపుటిలో ఉన్న పలు కవితలు గురించి వివరంగా మాట్లాడారు. కళా జనార్థనమూర్తి తదితరులు సభలో పాల్గొన్నారు. కృతికర్త కవి నారాయణరెడ్డిని అతిథులు ఘనంగా సత్కరించారు. తాను రాసిన అశ్వాలు కవితలు గురించి నారాయణరెడ్డి మాట్లాడారు. సంస్థ కార్యదర్శి, కవి రఘుశ్రీ సభకు స్వాగతం పలికారు. సంస్థ అధ్యక్షుడు బండారుపల్లి రామచందర్‌రావు, ఉపాధ్యక్షురాలు డాక్టర్ లలితవాణి తదితరులు సభలో పాల్గొన్నారు. విద్యావేత్త డాక్టర్ నోరి రాజేశ్వరరావు, కవి పెద్దూరి వెంకట దాసు వీరంతా నగ్నధ్వని కవితా సంపుటిలో ఉన్న పలు కవితలు గురించి వివరంగా మాట్లాడారు. కృతికర్త కవి నారాయణరెడ్డిని అతిథులు ఘనంగా సత్కరించారు. తాను రాసిన అశ్వాలు కవితలు గురించి నారాయణరెడ్డి మాట్లాడారు. సంస్థ కార్యదర్శి కవి రఘుశ్రీ సభకు స్వాగతం పలికారు. సంస్థ అధ్యక్షుడు బండారుపల్లి రామచందర్‌రావు, తదితరులు సభలో పాల్గొన్నారు. సభకుముందు జరిగిన కవి సమ్మేళనంలో పలువురు కవులు, కవయిత్రులు స్వీయ కవితా గానం చేశారు.

నేటి దృశ్యం

ఏల కరువు , విలయమ్ములు

జలనయనం గల భూమికి
వనచర్మం గల నేలకు
ఏల దాహ మీ పుడమికి
చేలాంచల తరుగామికి!

గిరిహారంగల ధరణికి
జలలతాంత శుభగామికి
ఏల వణుకు పుట్టెనిపుడు
ఘనపీఠికమేఖలకు!

బహు సాగర పరీవృతకు
బహువర్ణాంబర సహితకు
ఏల కరువు ,విలయమ్ములు
విషఛాయల వలయమ్ములు!

శుకపికగళ శుభరవళికి
సుఖవసతీగృహావళికి
ఏల ధూళిధూసరములు
కాలయముని కాహళులు?

నరుడా నీ పయనంలో
ఏదో శ్రుతిలోపముంది!
ఘనుడా నీ గమనంలో
ఏదో మతిభ్రంశముంది!

ఖాండవదహనాలాపి

మహిళా నీకిదే నా ఓ వందనం

కళ్లు తెరిచిన క్షణం నుంచి..
బంధం కోసం..
బాధ్యత కోసం..
కుటుంబం కోసం..
అందరినీ చూడండి
కనుపాపలా తలచి,
ఆత్మీయత పంచి,
తనవారి కోసం
అహర్నిశలు కష్టించి,
వారి భవిష్యత్తు
గురించి తన ఇంటిని
నందనవనం
చేసే
స్త్రీ మూర్తికి
పాదాభివందనం.....
జననం నీవే..గమనం నీవే
సృష్టివి నీవే.. కర్తవు నీవే
కర్మవు నీవే
ఈ జగమంతా నీవే
అందుకే భగవంతుడు అన్ని
చోట్లా ఉండలేక ప్రతి ఇంట్లో
నిన్ను సృష్టించాడు మహిళా
నీకిదే నా ఓ వందనం

-మడికొండ మమతాగిరి
9949241219

అమ్మ ప్రత్యక్ష దైవం

అమ్మ సృష్టిలో తీయనిది ,
అపురూపమైనది ,
అనంతమైనది అమ్మ,
అంగడిలో దొరకనిది అమ్మ,
అమ్మ ప్రాణ దాత,
అమ్మే ఒక వేదం ,
అమ్మ ఉనికిని అద్దం పట్టి
చూపింది మన భారతీయ సంస్కృతి.
బిడ్డకు తొలి గురువు అమ్మ,
తొలి అడుగు వేయించేది అమ్మ,
తొలి మాటను పలికించేది అమ్మ,
తల్లికి తొలి ప్రాధాన్యతనిస్తూ
మాతృ మూర్తిని దేవతలా
ఆరాధించి పూజలందించిన
మొట్ట మొదటి దేశం భారత దేశం.
అమ్మ ఇలలో దైవం,
అమ్మ శాంతికి నిలయం,
అమ్మసహనానికిమారుపేరు,
అమ్మ హృదయం
మమతల కోవెల ,
అమ్మ శక్తి స్వరూపిణి ,
అమ్మ నిత్యం సత్యం
అని అమ్మ గురించి
నలు దిశలా ఎలుగెత్తి చాటింది
మన భారతీయ సంస్కృతి.
అమ్మ సృష్టి కర్త ,
అమ్మ త్యాగ మయి,
అమ్మ ఆది గురువు ,
అమ్మ అమృత వర్షిణి,
అమ్మ అనురాగ దేవత
అని అడుగులకు మడుగు
లొత్తింది మన భారతీయ సంస్కృతి .
పెదవి పలికే మాటలలోన
తీయని మాటే అమ్మ
అమ్మ అభిమానానికి మారుపేరు ,
క్షమతవ్యానికి మరోపేరు ,
అమ్మ ప్రేమకు పెన్నిధి ,
అమ్మ మమతల మూట ,
అమ్మ జగతికి మూలం.
అని వేనోళ్ళ చాటింది
భారతీయ సంస్కృతి.
అమ్మ కొంగులో పెరిగిన బిడ్డ
అమ్మ పాలలోని మాధు
ర్యాన్ని చవి చూసిన బిడ్డ
వేదాలను వల్లించగలడు,
అద్భుతాలను సృష్టించ గలడు,
ప్రగతి బాటలో పయనించి
పదుగురికి ... చేయుతనందించగలడు,
సంస్కృతి సంప్రదాయాలకు
అద్దం పట్టేది అమ్మ అని
నలుదిశలా ఎలుగెత్తిచాటింది
భారతీయసంస్కృతి"

-రాయవరపు సరస్వతి
9885656356

ఒక్కసారి ఆలోచించండి

ఆధిపత్య పోరు మొదలయింది
మిస్సైల్ మోత రాకెట్ తారాజువ్వల మంట
గగనతలంలో రాఫెల్ గాండ్రింపులు.

శాంతి నగరం లో రణగొణ శబ్దాలతో
ఉక్రెయిన్ పుడమి భీతిల్లవంటే
జనాల ప్రాణాలు అరచేతిలో
వైకుంఠ మాయే
సామాన్య జనం పరిస్థితి
అగమ్యగోచరంగా తయారయ్యే

ఓ ప్రక్క బాంబుల మోత...
మరోపక్క జనం ఆకలి కేకలు
రణభూమి రక్తపుటేరులై పారుతుంది.

ఆధిపత్య పోరులో...
అన్యం పుణ్యం ఎరగని
రక్షణ బిడ్డలు ఎందరో ?
నేలకొరిగారు...
యుద్ధం వద్దు
శాంతికి చర్చలే ముద్దు
ఓ పాలకులారా!
ఒక్కసారి ఆలోచించండి!

-చాపలమహేందర్
9949864152

గంగాతరంగాలు

గురువు సూర్యుడు
ఆశయాన్ని నింపుతాడు
స్నేహితుడు చంద్రుడు
ఆహ్లాదాన్ని పంపుతాడు.

సామాన్యులు
చరిత్రను కొలుస్తారు
ప్రతిభావంతులు
చరిత్రగా నిలుస్తారు.

ఆశయ సాధనకు అడుగులు వేస్తుంటే
మనవైపు వేలెత్తి చూపిస్తారు
ఆశయం ఆదర్శమైన నిలిచినపుడు
మనవైపు వేలుతిప్పి చూపిస్తారు.

సత్యాన్ని గ్రహించిన వాడు
ఇతరులకు ప్రేమను పంచుతాడు
సత్యాన్ని గ్రహించని వాడు
ఇతరులనుండి ప్రేమను ఆశిస్తాడు.

లోకంలో నిలచిపోవాలంటే
బయటకు నడువు
లోకాన్ని గెలిచిపోవాలంటే
లోపలికి చూడు.

-డా.పింగళి గంగాధర్ రావు,
7013072972.

ఉద్వేగ తరంగాలు.

మనసిప్పుడు మోడువారింది...
ఈ శిశిరఘడియలు కదిలి
వాసంతం వస్తుందన్న
నమ్మకం కరువై....

ఎలా వస్తుంది మరి....!
అయినా వారిమధ్యే ఉన్నా...
ఒక్కక్షణమైనా కరుణాకాంతులు
చూపులు ప్రసరించని
చీకటికూపంలో జీవిస్తుంటే...

సత్తువున్నంతకాలం విరామాన్ని
ప్రకటించని రెక్కలు...
విశ్రాంతికి నోచని పాదాలు....
నిర్జీవపు అవశేషాలై జీవంపోసే
పలకరింపుకై నిరీక్షిస్తుంటే...

ఒక్కసారి పలకరించి చూడు...
తనవారికి అన్ని
అమర్చాలని యంత్రంలా
మారిన తనువు...
నిరాశలరాగాన్ని వీడి....
నవ్వులవాహినిలా మారుతుందిప్పుడు...

ఏ నిమిషమూ తనకంటూ
ఏమాశించని నిస్వార్థపు హృదయం...
ఉద్వేగతరంగమై ఉరకలెత్తుతుందిప్పుడూ....
తనను తనలా గుర్తించినందుకు....
అనురాగపు విస్తట్లో
గుప్పెడు ప్రేమను
వడ్డించినందుకు....

-స్వప్నకృష్ణ
9440536669

కమ్మనైన కామెడీ కథలు

సమకాలీన కథా రచయితల్లో వాసిని, రాశిని తనదిగా చేసికుని రాజిలుతోన్న ఆర్.సి.కృష్ణస్వామి రాజుగారు నిజంగా రాజే! 'కథా చక్రవర్తి' అన్నా అది రాజుగారి పట్ల సార్థక నామధేయమే అవుతుంది. మాండలిక కథలు బాలల కథలు! కార్టు కథలు, ఆధ్యాత్మిక కథలు- అన్నింటా తన ప్రావీణ్యతను చూపారు. ఇప్పుడు కామెడీ కథలతో మన ముందుకు వచ్చారు. ఇది వారి ఏడవ సంపుటి. తిరుపతి ప్రాంత రాయల సీమ భాష, యాసలపై సాధికారత సాధించిన రాజుగారి ఈ కామెడీ కథలు పొట్ట చెక్కలయ్యేంతగా నవ్వు పుట్టించవు. చక్కిలిగింతలు పెడితే, నవ్వుతో మెలికలు తిరిగినట్టుండదు. చిరునవ్వు పెదాలపై పూయించి గిలిగింతలు పెడతాయి. మోవు నిండా మొలక నవ్వుల పూవులు పూస్తాయి.

సంపుటికి నిర్ణయించిన టైటిల్‌తోనే రచయిత తన ప్రత్యేకత నిరూపించుకుంటారు. 'దుశ్శాలువా' అనగానే దుస్సాహసం, దుర్మార్గం దుస్స్వప్నంలోని పదాల భావం అనుకుంటాము. రాజుగారు 'దు' అన్నపదాన్ని 'రెండు' అని అర్థం వచ్చేట్లుగా వాడారు. సంస్కృతంలో 'ద్వ' అన్నా 'దుగ' అన్న రెండు అని అర్థం. విశిష్ట గౌరవం ఇచ్చే సందర్భంలో సన్మానితులకు జంట శాలువాలు కప్పుతారట!

రాజుగారు మనకు కూడా దుశ్శాలువా కప్పి తన కథా లోకానికి ఆహ్వానిస్తున్నట్లు భావిస్తూ కథల్లోకి నడుద్దాం.

సంపుటిలో 20 కథలున్నాయి. ఇవ్వన్నీ లోగడ పలు భౌతిక అంతర్జాల ప్రతికల్లో ప్రచురించబడి పాఠకుల చేత శాలువాలు కప్పించుకున్నవే! ఈ కథలనన్నింటినీ ఏకబిగిన చదువుకుని నవ్వుకునే అవకాశం కల్పిస్తున్నారు.



కథ సామాన్యం. కథల్లో పొదిగిన కామెడీ అసామాన్యం.కథ, కథనం, కామెడి- ఈ మూడూ ముప్పేటలా పేనబడిన కథలివి. మొదటి కథ 'దుశ్శాలువా కప్పంగ' లోని హీరో ఎనగొండ సుబ్రహ్మణ్యం నాయుడు, ఇరిగేషన్ డిపార్టుమెంటులో ఉద్యోగం. 'టైర్డ్' (Tired) అయ్యారని యాజమాన్యం ఆయన్ని రిటైర్ చేసారట. (పదాల్లోని పన్ Pun గమనించండి. నాయుడిగారి రిటయిర్మెంటు ఫంక్షన్‌ను తిరుపతిలోని సుబ్రహ్మణ్యం పిళ్ళై సమావేశ మందిరం 'గ్రాండ్'గా ఏర్పాటు చేసారట. గ్రహీత ఇచ్చిన డిన్నర్‌లోని ఐటమ్‌లు- నెల్లూరు జిల్లా బుచ్చి బిరియాని, పొదలకూరు పొట్టేలు మాంసం, కోవూరు కోడిమాంసం, కావలి కోడిగుడ్ల వేపుడు, గూడూరు గోంగూర, నెల్లూరి నెయ్యి, ఆత్మకూరు బియ్యం అన్నం, వింజమూరు వంకాయ కూర, వాకాడు వడియాలు, ఉదయగిరి ఊరగాయలు, తడవడ, ముత్తుకూరు మజ్జిగతో వడ్డిస్తే, దండి దండిగా జనాలు వచ్చినారట!

ఐటమ్స్ చదువుతూంటేనే మనకు నోట్లో నీళ్లూరుతున్నాయి కదూ!

ఇలాంటి వర్ణనలు, వివరాలు, దాదాపు అన్ని కథల్లోనూ, కనిపిస్తాయి. మరో సందర్భం-వంకాయతో వంటలు- గుత్తివంకాయ వంకాయ పులుసు, వంకాయ సాంబారు, వంకాయ పులగూర, కుర్మా, పచ్చడి వంకాయ తాలింపు-వంకాయకు ఇంత 'సీన్' ఉందని మన పౌరాణిక 'మాస్టర్ షెఫ్'లు నలుడు, భీముడికి కూడా తెలిసి ఉండకపోవచ్చును. మీకు తిరుపతిలోని రోడ్లు, ప్రదేశాలు బాగా పరిచయం లేవా? పదండి. రాజుగారిననుసరిస్తే, గాంధీరోడు, అలిపిరి రోడు, మంగళంరోడు, వేదవ్యాస భవన్ జీవకోన NGO కాలనీ, ఖాదీ కాలనీ నల్లపరెడ్డి 'కాంప్లెక్స్, తీర్థ కట్టవీధి, ధన్వంతరి హాస్పిటల్, భాష్యకార్ల సన్నిధి, గరుడాద్రి సర్కిల్- ప్రాంతాలగుండా త్రిప్పి తిరుపతి అంతా చూపిస్తాడు రచయిత.

సన్నివేశ వర్ణనలో ఆయన్ను మించిన వారు లేరు 'లాకర్ గోల్డ్' కథలో లెక్చరర్ లవ కుమార్ తమ ఇంటి పోర్టికోలో ఊగే ఉయ్యాలలో కూర్చున్నాడట. నల్లకుండ పొట్ట చింతింత కనుగుడ్లు, నల్ల తెల్ల మీసాలు.. చెవిలో గులిమి తీసుకున్నాడట!

ఇది చదివిన పాఠకుడికి లెక్చరర్ లవకుమార్ రూపు రేఖా విలాసము కళ్ళకు కట్టినట్లే ఉంటుంది.

'తోలుకల' కథలో పని మనిషి రాములమ్మకి పట్టరాని సంతోషం కలిగింది. జాతరా 'పలకలు' కొడితే శబ్దానికి అనుగుణంగా 'డబ్బుస్కు డబ్బుస్కు' డాన్సు చేసిందట!

సామెతలు చెప్పటంలో కూడా రాజుగారు మహరాజే. తేనె తీసినోడు చేయినాకకుండా ఉండలేడు (పే.54) సొత్తు కలిగినోడు ఇల్లు కడితే స్థిరాస్థి అవుతుంది. సొత్తులేనోడు కడితే అప్పు మిగులుతుంది (57) అప్పులేని మనిషి పిప్పి లేని పగడం ఉండదు (35) పండ్లున్నోడికి పప్పులు లేవు. పప్పులున్నోడికి పండులేవు (40) పొయ్యిమీది నెయ్యిలా కరగటం కొంగున కట్టిన ఇంగువలా (వాసన) వ్యాపించటం (90) ఇవన్నీ రాజుగారి పద చాతుర్యాలే!

రీటయిరవటం కారు కొనటం, డెంటల్ డాక్టర్ ప్రాక్టీసు బ్రోకర్ వరహాల రాజు చేపించే తిరుమల దర్శనం, డబ్బారేకుల సుబ్బారావు పుస్తకావిష్కరణలో తీరిన డబ్బుదురద జీవితంలో చోటు చేసుకునే ప్రతి సామాన్య సన్నివేశానికీ ఇంద్ర ధనస్సు రంగులద్దుతారు. హాస్యపు జల్లులు కాదు, జడివానలే కురుపిస్తారు.

కథల్లో హాస్యం పండాలని, చాలా 'సీరియస్'గా ఆలోచించి 'Present' చేస్తోన్న కథలు. మరిన్ని ఇంకా మంచి కథలు రాజుగారు మనకందిస్తారని ఆశిద్దాం..

ప్రతులకు:
ఆర్.సి. కృష్ణస్వామి రాజు
22-4-71,
బ్యాంక్ ఎంప్లాయిస్ కాలనీ,
మంగళం రోడ్,
తిరుపతి- 517 501
సెల్: 9393662821

- కూర చిదంబరం
సెల్: 8639338675

ఇదే..జీవితం

జీవితం
చీకటి వెలుగుల సంగమం
ఓటమి గెలుపుల సంమ్మేళనం
చీకటి వెంటే వెలుగుంటుంది
ఓటమి వెంటే గెలుపుంటుంది
ఇదే జీవితం
ఇదే వాస్తవం...

గమ్యం
దూరం ఉన్నదని
నిరాశ చెందకు నేస్తమా !
ఓటమి చీకటి
భయపెడుతుందని
దిగులు పడకు మిత్రమా !
ఆశే నిన్ను గెలిపిస్తుంది
వెలుగే నిన్ను నడిపిస్తుంది..

కోరుకున్నది అందలేదని
కోరనిదేదో అందినదని
అందినదేదో నీది కాదని
దిగులు చెందకు నేస్తమా!
అందినదేదో నీదనుకొని
తృప్తి చెందు మిత్రమా!

-బూర దేవానందం
9494996143

అశ

మంచితనం ముసుగేసుకున్న మనుషుల్లో
మానవతకై వెదుకులాట
ఎండమావి లో నీటిచుక్కకై పాకులాట

కుళ్లిన వ్యవస్థలో తాజాదనపునీతికై శోధన
మారిన సంస్కృతి లో సాంప్రదాయపు జాడలకై అన్వేషణ

సరస్వతీ నిలయాల్లో రాజకీయాల కీచురాళ్లరొద
ఆహారం ఆహార్యాల పరిశోధనే విజ్ఞానార్జన

ఏదో ఒక ఇజాన్ని రేకెత్తి పొందే అవార్డుల వేటలో
సాహిత్యం వెలుగు
సమాజహితం కోరే మనీషుల గ్రంథాలకు పట్టిన చెదపురుగు

అస్తిత్వం కోల్పోతున్న ఒక తరం
అసహాయతతో వీక్షిస్తున్న దిగజారుడు తనం

ఏ మహనీయుడు పుట్టాలోసంస్కరణకై
ఒక్కడు కాదు ఇంటింటా ఉద్భవించాలి
నవ నవోన్మేష తరానికై

-లలితా వర్మ.
9949672671



'సీమ'లో ఎప్పుడూ
స్వేదంతో సేద్యం
కుంభవృష్టి కురిసినా
తడి తగలని దౌర్భాగ్యం.

పౌష్టికాహారలోకం
సకల గ్రామీణ భారతం
పేదరికం కాటుకు
జాతంతా నిర్వీర్యం.

'పో'రు' ఇక్కడి స్వరం
తెలంగాణా సర్వం
కలం మహా గరం
ఈ గడ్డకదో వరం.
తెలుగు భాష
కమ్మని పాడియావు
దొంగలనకది 'మస్తు'
లేగదూడలే 'పస్తు'.

పొగడ్తల 'రుచి' మరిగితే
పాడవడం ఖాయం
నాశనమయ్యాక
ఏడిస్తే ఏం లాభం?

మనిషి బుర్ర ఎప్పుడూ
డబ్బు వెంటే పరుగు
వయస్సు వుడిగినా సరే
భూతమై తిరుగు.

కవిత్వం కూడా
కదనరంగమే
కాలం 'కుంభస్థలాన్ని'
'కలం'తో ఎదుర్కొనడమే.

-మాయకుంట్ల నారాయణరెడ్డి
9989686603

పుస్తక సమీక్షలు

శ్రామిక నానీలు-మహేందర్ భావాలు

"ఆకులు లేకుంటే
చెట్టునెలా గుర్తిస్తావ్!
పచ్చదనమే
చెట్టు చిరునామా!
విద్యార్థులు
కళ్ళ శాలువాలు కప్పుతారు
అధ్యాపకుడికి
అంతే చాలు!
చంద్రునంత
కన్నీటి చుక్క
తుడిచే ఆకాశం
మదర్ తెరీసా !
బాల్యాన్ని
దాటినప్పుడు తెలియదు
జీవితం
మోసపోయిందని !
రైలు పట్టాలు
తాము
కలవ్వు గాని
దూరాలను కలుపుతాయి!

నానీలు రూపకర్త ఆచార్య డా. యన్. గోపి గారు.నాలుగు పంక్తుల్లో మొత్తం 20నుంచి25 అక్షరాలతో సాగే సూక్ష్మ కవితా పద్ధతిని "నానీలు" అని చెప్పొచ్చు. తెలుగు సాహిత్యంలో ఎన్నో సాహితీ ప్రక్రియలున్నాయి.అవి ఎందరో మహానుభావుల చేతుల్లో పురుడు పోసుకున్నాయి. సినారె ప్రపంచ పదులు,ఆరుద్ర కూనలమ్మ పదాలు, గురజాడ ముత్యాల సరాలు,సుగమ్ బాబు రెక్కలు,గజల్స్, నానోలు,హైకూలు మొదలైనవి. మచ్చుకు కొన్ని.తెలుగు లఘు కవితా ప్రక్రియల్లో గోపి గారి నానీలకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ ప్రక్రియలో ఎన్నో పుస్తకాలు వెలుబడ్డాయి.నేటికీ ఎందరో కవులు నానీలు నిరంతర ప్రక్రియ గా రాస్తుండడం గమనార్హం. వాటికి అంత క్రేజీ ఉంది.ఒకానొక సమయంలో ఒక ఊపు ఊపిన ప్రక్రియ నానీలు.

వీరి అడుగుజాడల్లో పయనిస్తున్న వర్ధమాన కవులలో శ్రీ చాపల మహేందర్ గారు ఒకరు.విద్యావంతుడైనా ,వినయ సంపన్నుడై జీవనోపాధికై ఒకవైపు తాపీ మేస్త్రీగా పనిచేస్తూ మరోవైపు మాతృభాషపై మమకారంతో సాహితీ సేద్యం చేస్తున్నారు. ఇప్పటికే తన కష్టార్జితంతో "మదిలోని భావాలు" (హరివిల్లు) పుస్తకం ముద్రించారు.ఇప్పుడు తన రెండో పుస్తకం "శ్రామిక నానీలు" ముద్రణకు శ్రీకారం చుట్టారు.తాను శ్రమజీవి కావడం వల్ల,శ్రామిక జీవన సౌందర్యం ఎరిగిన వాడు కాబట్టి తన ద్వితీయ పొత్తానికి "శ్రామిక నానీలు" అని ముద్దుగా నామకరణం చేశారు.ఇవాళ పరభాషల మోజులో మాతృభాష తెలుగు పై ఆదరణ తరుగుతున్న వేళల్లో తాపీ పట్టిన చేతులతోనే కలం పట్టి కవితలెన్నో లిఖించారు.ప్రతి రోజు పత్రికలలో వారి రచనలు చోటుచేసుకుంటాయి. కష్టజీవి

అయిన మహేందర్ గారు పాళీతో హోళీ చేస్తూ అక్షర గోళీలతో ఆడుకుంటున్నారు.ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. తెలుగు భాషాభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నారు.అలతి అలతి వాడుక పదాలతో వేడుక చేస్తున్నారు.అనుభవజ్ఞులైన పెద్దల సహచర్యంతో,అనుభవాలతో అద్భుతమైన నానీలు సృష్టించారు.వాటిలో కొన్ని పరిశీలిద్దాం:"అక్షరాలే/కవి సేద్యం/కవి భావనలే/సాహిత్యపు తోట"అని కవికి ,అక్షరాలున్న అవినాభావ సంబంధాన్ని ముగ్ధమనోహరమైన వర్ణనతో తేటతెల్లం చేశారు."నిన్నటి /బాల్యపు గుర్తులు/ఇప్పటికీ/అమృత జ్ఞాపకాలే!' అని చిన్ననాటి మరుపురాని జ్ఞాపకాలను అమృతంతో పోల్చి గొప్పగా చెప్పారు."ఎస్పీ బాలు/గంధర్వ శిల్పి/వర్తమాన గాయకులకు/మణి దీపం" అంటూ అమరజీవి, మధుర గాయకుడు ,తెలుగు తేజం బాలు గారు నూతన గాయకులకు మణి దీపమని కళ్ళకు కట్టినట్లు వివరించారు."మనిషి ఉన్నప్పుడు/మంచి నీళ్ళు పొయ్యారు/తద్దినానికి/పంచ పరమాన్నం"అని నేటి సమాజంలో నెలకున్న దుస్థితికి వాపోయారు."ఎడతెరిపి లేని/వర్షాలు/దినసరి కూలీ/ఆకలి వెతలు" రెక్కాడితే డొక్కాడే దినసరి కూలీ వెతలు అతివృష్టి వల్ల అధికమవుతాయని తనదైన శైలిలో స్పష్టం చేశారు.

ఇంకా "మనసుకు గాయం/కన్నీళ్లు ధారాపాతం/అవినాభావ సంబంధం/అనుకుంటా!"మనసు గాయపడితే వచ్చేది నీళ్ళేయని చక్కని ఉపమానం చెప్పారు."వాన చినుకులైన/చెమట బిందువులైన మట్టి వాసనే / పరిమళిస్తుంది" వానచినుకులకు,చెమట బిందువులకు మట్టి పరిమళం ఉంటుందని గళమెత్తి నినదించారు."రైతు కన్నీటి/వరదలో/చేతికొచ్చిన చేనంత/కొట్టుకు పోయింది" అన్నదాతల కన్నీటి వ్యధలను చూడచక్కని నానీలో పొందుపర్చారు.

"గిలగిల కొట్టుకుంది/దోమ/నన్ను ముట్టుకుంది/కరోనా పాజిటివ్ ఏమో!" అని కన్నెర్ర జేసిన కరోనాపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు." అదగకముందే/అన్ని వరాలూ ఇచ్చే/దేవుడు/మా నాన్న గారే!''అని భగవంతుడు అడిగితే వరమిస్తాడు కానీ కనిపించే దైవమైన నాన్న అడగకముందే అన్ని అవసరాలు తీర్చుస్తాడని చక్కని నానీ చిక్కగా చిలికారు."కలహాల సృష్టికర్త/ధనము/బంధాలను/విడగొట్టేది" ధనాపేక్ష సమస్త కీడులకు మూలమని,కలహాలను సృష్టించి మానవ సంబంధాలకు ఎసరు పెడుతుందని సూటిగా సెలవిచ్చారు."పలకా బలపం/నా మొదటి నేస్తాలు/నేటికీ/అమూల్య జ్ఞాపకాలే!" అని చిట్టిచేతులు పట్టిన పలకా బలపంపై అమూల్యమైన జ్ఞాపకాలగా అభివర్ణించారు."బ్రతకడానికి/బహు భాషలు నేర్చుకో!/మాతృభాషను మాత్రం/గుర్తించుకో!!" అని హితవుపలికారు."నాన్న /ఉరుములా ఉరిమినా/భవిష్యత్ లో/వెలుగునింపేందుకే!!" తండ్రి కోపపడినా బిడ్డల భావి జీవితాల్లో కాంతిని నింపడానికే నని అక్షర సత్యాలు ప్రభోదించారు."స్కూరు బడి/నాకొక వరం/అక్షర జ్ఞానం/ప్రసాదించినందుకు" తాను చదివిన స్కూరు బడి గుడిని గూర్చి జ్ఞానాన్ని ప్రసాదించిన వరాల తల్లిగా గుర్తు చేసుకున్నారు."చెట్టుది/గాంధేయవాదం/రాళ్లతో కొట్టినా/ఫలాలనే ఇస్తుంది"అని చెట్టుకు, గాంధేయవాదానికి ముగ్ధమనోరమైన పోలిక చెప్పారు."గబ్బిలంతో/శివుడికి కబురెట్టాడు/కుళ్ళున్న/సమాజాన్ని చూడమని" కాళిదాసు మేఘ సందేశంలా,గుజ్జం జాషువా గబ్బిల సందేశం స్మరణకు తెచ్చారు.చివరిగా "ఆకాశంలో /మేఘాల గర్జన/భయం గుప్పెట్లో/అవని బిడ్డలు"అని మేఘాలు గర్జిస్తే భీతితో హడలిపోతారని ఉరుములు మెరుపుల్లాంటి నానీతో ముగించారు నిరంతర శ్రమ జీవి చాపల మహేందర్ గారు.

ఇలా ఎన్నో ఆణిముత్యాల్లాంటి నానీలు శ్రామిక జీవి చాపల మహేందర్ కలం కడలి గర్భంలో రూపుదిద్దుకొన్నాయి. అన్వేషించిన కొలది కోకొల్లలుగా గుప్తనిధుల్లా బయటపడుతాయి.వారి పాళీ నుంచి మరెన్నో పుస్తకాలు వెలుగుచూడాలని మనసారగ కోరుకుంటూ,తొలిపలుకులకు అవకాశమిచ్చినందుకు కృతజ్ఞతాభినందలు తెలియజేస్తూ..సోదర కవిమిత్రుడు

ప్రతులకు:
చాపల మహేందర్
గ్రా॥ మాణిక్యపురం
మం॥ లింగాలఘణపురం
జిల్లా: జనగామ
9949864152

-గద్వాల సోమన్న
9966414580

కాస్త జాగ్రత్త నేస్తమా...!

బాగా నమ్మించి
నవ్వుతూ నవ్వుతూ
నిన్నునట్టేట ముంచే
నక్కలుంటాయి
పాలకుండలోవిషపు
చుక్కలుంటాయి
కుట్రలు కుతంత్రాలు పన్నే
కుక్కలుంటాయి...కాస్త జాగ్రత్త నేస్తమా

ఆకు,ముళ్ళు మీదపడ్డా
ముళ్ళు,ఆకు మీద పడ్డా
అద్దంగా చిరిగేది ఆకేనని మరువకు
అవకాశాలను కాలదన్నుకోకు
నీ ప్రవర్తన నచ్చిననాడు
నెత్తిన లేదంటే నేలన,హేళన
కళ్ళముందే అన్యాయం
అక్రమం జరిగితే ఖండించు
క్షణంసేపు బాధగానే ఉండవచ్చు
లేకుంటే నీవే బలికావచ్చు
భారీగా నష్టపోవచ్చు...
కాస్త జాగ్రత్త నేస్తమా
నిజం తెలుసుకో నీవున్నది
విషసర్పాల మధ్య
విషపురుగుల మధ్య,
కోరలులేని పులుల మధ్య
కస్సుబుస్సు మనకుండానే
కాటేసే కోడెనాగుల మధ్య
నీకు నీతులు చెబుతూ వెనుక
లోతుగా గోతులు తవ్వే కోతులమధ్య
నీవున్నది నిన్నువాడుకొని
వదిలేసే నీచుల మధ్య...
కాస్త జాగ్రత్త నేస్తమా

ఎవ్వరినీ పూర్తిగా నమ్మకు
ఎవరైనా నిన్ను ఇంద్రుడన్నా
శ్రీరామ చంద్రుడన్నాపొంగిపోకు
కొందరి ప్రేమ ఆప్యాయత అభిమానం
అభినందన అంతా బూటకం
నాలుగు రోజుల నాటకం...
కాస్త జాగ్రత్త నేస్తమా-

-పోలయ్య కవి కూకట్లపల్లి
9110784502

కరోనా కథలు

మానవత్వం

ఎప్పటి లాగే ఆఫీసు నుండి ఆ రోజు కూడా సాయంత్రం నా స్కూటీపై గాంధీనగర్‌లోని శాంతి విలాస్ అపార్ట్‌మెంటుకు వచ్చేస్తున్నాను.

ఆ వీధిలోని మూల మలుపు దగ్గర ఓ వృద్ధురాలు అపస్మారకంగా రోడ్డు పక్కన పడి ఉంది. ఆమెను చూసి మనసుండ బట్టలేక నా స్కూటీని పక్కన ఆపి ఆమె దగ్గరికెళ్ళ, ఆమె పరిస్థితి అధ్వాన్నంగా ఉంది.వెంటనే 108కు ఫోన్ చేశా, ఆ తర్వాత నా హ్యాండ్ బాగులో నున్న బాటిల్‌లోని వాటర్‌తో ఆమె ముఖం మీద చిలకరించ, దాంతో ఆమె మెల్లిగా కళ్ళు తెరిచి చూస్తూ దీనంగా "అమ్మా! నన్నేదైనా ఆసుపత్రికి.." అని అంటుంటే ఆమె మాటలకు నా మనసు చలించిపోతోంది.

"సరే లే అవ్వా! అయినా నీవెంటి ఇలా?.."

తానేదో చెప్పబోతోంది కాని తన మాటలు తడబడుతున్నాయి. నాకేం అర్థం కాలేదు.

అంతలోనే 108 వ్యాన్ రావడం తనను తీసుకెళ్ళడం చకచక జరిగిపోయాయి.

నేను గనక చూసి ఉండకపోయుంటే పాపం ఆ ముసలమ్మ ఏమైపోయేదో,ఈ పట్టణాల్లో అందరివీ ఉరుకులు పరుగులే, ఎదుటివారిని గురించి కనీసం ఆలోచించే తీరిక ఏ ఒక్కరికీ లేదు. ఇలా ఆలోచిస్తూనే, అక్కడే దగ్గరలోనే నేను నివాస ముంటున్న అపార్టుమెంటుకు వెళ్ళిపోయా.

ఈ మధ్యేనేను సూర్యపేట్ నుండి నల్గొండలోని మున్సిపాటిలీ ఆఫీసులో సెక్షన్ ఆఫీసర్‌గా ప్రమోషన్లో వచ్చాను. మా మిస్టర్ టీచర్, తాను అక్కడే ఉండిపోయాడు. నేనొచ్చి ఓ నెల కూడా కాలేదు. పరిచయస్తుల అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉంటున్నాను.

మరునాడు ఉదయం యధావిధిగా రెడీ అయి ఆఫీస్‌కు వెళ్లడానికి, గేటు తీసి బయటికి వస్తున్నంతలో నా సెల్‌ఫోన్ రింగు అవుతోంది. అదేదో కొత్త నంబర్ అని లిఫ్ట్ చేయలేదు. తిరిగి మళ్లీ అదే నంబర్ రింగవుతుంటే విసుగుతో లిఫ్ట్‌చేశా. "హల్లో.. దిస్ ఈస్ భవ్యప్రవీన్..."

"మేడం మేము హెల్త్ డిపార్ట్‌మెంటు నుండి.." అవతలి నుండి జవాబు.

"చెప్పండి. ఏంటి విశేషం.." అని అడిగా.

"నిన్న ఈవినింగ్ 108కు మీరు ఫోన్ చేశారు కదా..!"

"ఆ అవును చేశా!? అయితే ఏంటి!..." అని ఆశ్చర్యపోతూ అడుగుతుంటే..

"ఏం లేదు మేడం కొన్ని పర్టికులర్స్ కోసం.. మీ రెసిడెన్స్ ఎక్కడ? మేమిప్పుడు గాంధీనగర్‌లో ఉన్నాం.."

"ఒకే రండి అని నా నివాస చిరునామా ఇచ్చా.. అయినా నాతో వీరికేం పని, చావు బతుకుల్లో ఉన్న వృద్ధురాలిని కాపాడడం కోసం ఫోన్ చేయడమే తప్పా? ఎందుకు చేశారు? వారు మీకు పరిచయమా? అక్కడికి మీరెందుకు వెళ్ళారు?" ఇలా అనేక యక్ష ప్రశ్నలేసి ఇబ్బంది పెడతారనే కాబోలు ఎవ్వరూ పట్టించుకోవడం లేదేమో.. నేను ఇలా ఆలోచిస్తున్నంతలోనే వారు రానే వచ్చేశారు.

వెహికల్ నుండి దిగీ దిగగానే.."మేడం.. భవ్య.." అని అనుమానంగా నన్నడుగుతుంటే..

నోరులేని జ్ఞానం లేని పశు పక్షాదుల కన్నాహీనంగా మనిషి మారిపోవడానికి ఈ మహమ్మారి కరోనా మరింతగా తోడైనట్టు అనిపిస్తోంది.

వారి మాట పూర్తవ్వక ముందే "అవును నేనే ఏమిటి విషయం.."అని అడగగా..

'ఏం లేదు మేడం, మిమ్మల్ని మెడికల్ చెకప్ చేయాలి, మా ఆఫీసర్ మిమ్మల్ని తీసుకురమ్మన్నారు.."

"నేనిప్పుడు డ్యూటీ కెళ్తున్నాను. అర్జెంట్ వర్కుంది" అయినా నాకు మెడికల్ చెకప్ ఏంటి?" అని అడిగా.

"అవన్నీ తరువాత ముందు మీ డిపార్టుమెంట్ ఫోన్ నెంబరేదో చెప్తే మేము ఫోన్ చేసి మీ డిపార్ట్‌మెంట్ పర్మిషన్ తీసుకుంటాం మేడం"

అమ్మ ఒక తీయని జ్ఞాపకం!

పొలంగట్టున కూచున్నప్పుడు
నాన్న గుర్తొచ్చినట్టే
అన్నంగిన్నె ముందు కూచుంటే
అమ్మే గుర్తొస్తుంది
ఆరు రుచుల అమ్మ చేయి
అన్నం ముద్దలుగా కలిపి
అన్నదమ్ములకీ అక్కా చెల్లెళ్లకి
వరుసగా ముద్దలు అందిస్తుంటే
అమృత భాండం మొత్తం
అన్నంగిన్నెలో ఒలికిపోయినట్టుంటుంది.
బంగారు రజనను
అమృతంతో తడిపి దేవుడు
అమ్మ అనే దేవతను సృష్టించి ఉంటాడు
లేకపోతే అమ్మ చేయి
పచ్చడితో కలిపి ముద్దపెడితే
అమ్మంత తీయగా ఎలా ఉంటుంది?
విందు భోజనం కంటే
రుచిగా ఎలా ఉంటుంది
అమ్మకి మాత్రమే తెలిసిన
పరుసవేది రహస్యం కాబోలు రుచి
కడుపునిండి హాయిగా
ఇంకా ఇంకా తినాలనే అనిపిస్తుంది
అందుకే ఆస్తులు
అన్నదమ్ములు పంచుకున్నా
నేను మాత్రం
అన్నంగిన్నెను
అపురూపంగా దాచుకున్నా
అమ్మంత తీయని జ్ఞాపకం అది!

– గుర్రాల రమణయ్య
సెల్: 9963921943

మన ఊరు - మన బడి..

అనేక వర్షాలుగా మనూరి
శివారులో జడలమర్రితో పాటు
ఒంటరిగా ఉండి
ఊరిలో జరిగే సంఘటనలకు
సజీవసాక్ష్యంగా నిలిచి..

పసిబాల్యపు పసిడిజ్ఞాపకాల్ని
తన స్మృతిపొదివిలో దాచుకుని
ఎన్నెన్నో తరాల్ని, అంతరాల్ని చూసి
చిలిపి చిన్నారుల్ని
ప్రయోజకులుగా మలిచి
సమాజం ఒడిలో వదిలి..

విజ్ఞానవిత్తుల్ని నాటి
అభివృద్ధితో పొత్తం చేయించిన
మనూరి బడి ఎవరు పట్టించుకోక
నేడు శిథిలావస్థలో
కొట్టుమిట్టాడుతోంది..

ఆదరణ కరువై
నిర్వహణ నిర్లక్ష్యపు బారినపడి
తనను ఆదరించే దరికై
తనను కాపాడేవారికై
వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తోంది..

బీటలు వారిన గోడలు
పగుళ్లిచ్చిన బండలు
ఊడుతున్న పెచ్చులు
కారుతున్న కప్పులు
బైటికి తేలిన సీకులు
పైనుండి వానినీటి లీకులు..

నువ్వు చదువుకున్న బడి
నువ్వాడుకున్న ఆటల మడి
ఆ చదువులమ్మ గుడి
బాల్యపుమధురస్మృతుల జడి
వృద్ధాప్యంలోనున్న ఆ గుండె తడి
నిను పిలుస్తోంది రా రమ్మని..
శిథిలమౌతున్న తన కాయాన్ని
భవిష్యత్ తరాలకై పదిలపర్చమని..
నిర్వహణ లేక రెపరెపలాడ్తున్న
జ్ఞాన జ్యోతిని తిరిగి వెలిగించమని..

-సర్ధరాజ్ అన్వర్
9440981198

కూటికి వచ్చి కాటికి

పట్టెడన్నానికే..
తనోళ్లనొదిలి..
పొట్టకూటి కోసం
పట్టెడన్నం ముద్దకు..
వలసొచ్చిన బీహారీ బీదలు
ఊపిరి తీసిన బతుకుదెరువులు !

భోరుమన్న బోయగూడ
కారు చీకట్లో అరణ్యరోదనలు
మాయదారి నిప్పు రవ్వలు
అగ్నికీలలై చుట్టు ముట్టిన..
పనికిరాని అభాగ్య ప్రాణులు
సమాజ వలసల స్క్రాప్‌లే !

తుక్కులో వారూ తుక్కై..
స్క్రాప్‌లో తామే స్క్రాపై..
జనావాసాల్లో ఎగిసిన..
కాయకష్టపు తనువులు
నిర్లక్ష్యపు మృత్యుకీలలు
మంటల్లో మాంసపు ముద్దలే !

వలసొచ్చి వల్లకాటికి..
కూలీకొచ్చిన విగతజీవులు
గోదాంలే గోరీలై..
సజీవ దహనమై..
అగ్నికి ఆహుతై..
నిద్రలోనే అనంత లోకాలకు !

కాలి బొగ్గైన శ్రామికులు
ప్రభుత్వ సత్వరగ్రాంతులు
పరిహార ప్రకటనల పర్వాలు
అధికారగణ దర్శనాలతో..
చేతులు దులుపుకునే ఆత్రాలు
ఆ 'పాత' సాంప్రదాయాలే కదా !
(సికింద్రాబాదు బోయగూడలో
అగ్నికి ఆహుతైన బడుగు జీవులకు
అక్షర నివాళిగా)

-మధుపాళీ
కాన్‌బెరా, ఆస్ట్రేలియా
9949700037

ఆకలేస్తే

ఆహారం కోసమే ఆకలేస్తే
వనాలు ఆకలి తీరుస్తోంది

అధికారం కోసమే ఆకలేస్తే
నిధులు వేటకుక్కలా కరుస్తోంది.

అక్షరం కోసమే ఆకలేస్తే
సాహిత్యం మంచి సందేశానిస్తోంది.

దోపిడక్షరానికి ఆకలేస్తే
నకిలి సాహిత్యానికి పట్టం కడుతోంది.

ఐశ్వర్యం కోసమే ఆకలేస్తే
ఆరని మంటలా జ్వాలా దీపమౌతుంది

పత్రికలకు పదేపదే ఆకలేస్తే
నిజాన్ని బయట పెడుతోంది

అదుపు తప్పిన పత్రికలకు ఆకలేస్తే
సమాజాన్ని భ్రష్టు పట్టి పీడిస్తోంది

వ్యవసాయ కూలీలకు ఆకలేస్తే
పండిన పంటలు ధాన్యాలై కురుస్తోంది

మూర్ఖులకు ఆకలేస్తే
ఊరూరు నాశనానికి దారితీస్తోంది.

నీతి పరులకు ఆకలేస్తే
చిరు దివ్వెలకు ఆశయమౌతోంది.

సహనానికి పదే పదే ఆకలేస్తే
ఉద్రేకానికి దారి తీస్తోంది.

కరుణామయులకు ఆకలేస్తే
ఆకలికి ఆకలే కడుపు నింపుతోంది

-దాసరి సుబ్రహ్మణ్యేశ్వర రావు
9493033534

మర్యాదతో బతుకుము

మదినిండా గాయాలున్న
గుదిబండలా వుండుము
దిగజారుడు తనంగుంటు
బానిసంగా మారుకుంటు..!
బతుకు వెల్లదీయకుము..!!

చాడీలు చెప్పుకుంటూ
చిల్లర చేష్టలు చేసుకుంటూ
చీదరింపులు ఎదుర్కుంటూ
అవమానాలు భరించుకుంటూ
అగమాగమవుకుంటూ..!
జీవనయానం చేయకుము..!!

ఖచ్చితత్వం పాటిస్తూ
నిక్కచ్చిగా మాట్లాడుతూ
నీతి నిజాయితీలకు విలువనిస్తూ..!
ఆదర్శంగా బతుకుతుండుము..!!

మాట మీద నిలబడుకుంటు
మంచిని చేసుకుంటూ
మర్యాదను ఇచ్చుకుంటూ
గౌరవం పొందుకుంటు..!
బతుకు బండి సాగించుము..!!

మనం మాట్లాడే మాటలే
మన విలువను పెంచును
మనం చేసేటి పనులే
మనకు పేరు తెచ్చును
మంచి మాటలు మాట్లాడుతూ
మంచి పనులు చేసుకుంటూ
మన్నలు పొందుకుంటు..!
మహారాజుల బతుకుము..!!

-పసుల.శంకర్
9542181301

పుస్తక సమీక్ష

డా॥ గొల్లపెల్లి రాంకిషన్ -భక్తి సంకీర్తనా తరంగాలు

డా॥ గొల్లపెల్లి రాంకిషన్, (రాఖీ) 108 గేయాలను 'వందే విష్ణుమ్' భక్తి గీతాలుగా ప్రచురింపచేసి, ఆధునిక సాహితీ వాగ్గేయకారునిగా, భక్తి తత్వ కవిత్వ రచయితగా, ఆధ్యాత్మిక జిజ్ఞాసను ప్రసరింప చేస్తున్నారు. వచన కవితలు, పద్యాలు, నానీల రచయితగా సుపరిచితులైన, 'రాఖీ' 2500పైగా గీతాలను రచించి సోషల్ మీడియా వేదికగా, విశేష రచనా కౌశలంతో బెంగళూరు విశ్వ విద్యాలయ డాక్టరేట్ గౌరవం పొందారు. భక్తి బీజాలను నాటే ఆధ్యాత్మిక తత్వ బోధనావేత్తగా కలియుగ వేంకటేశ్వరునికి, వేములవాడ రాజేశ్వరునికి, ధర్మపురి నరసింహస్వామి పాదార్చనలకు అంకితమైన 108 సంకీర్తనలను విష్ణు ఆరా ధనా భావావేశంతో పుస్తకం వెలువ రించారు.

"మేలుకో నరహరే మేలుకో" సుప్రభాతంతో ఆరంభించి శ్రీ సత్యనారా యణ స్వామి మంగళహారతితో పూర్తి అయిన ఈ ప్రచురణలో ధర్మపురి నృసింహ, శ్రీ రామచంద్రుడు, శ్రీ కృష్ణుడు దివ్యస్వరూప వైభవాలను దర్శింపచేసారు. అలతి అతి పదాలు, మనం మాట్లాడుకొనే సరళ వ్యవహారంతో, ప్రాసధారలో గేయాలు సాగిపోవటం, రచయిత ప్రతిభ అద్భుతంగా ద్యోతకమవుతుంది. ప్రతిచరణం నాల్గు పాదాల అంత్యప్రాసలు, శ్లేషలు, స్వభావోక్తి, ఉత్ప్రేక్ష ఉపమానాలు, వ్యాజస్తుతితో, కవితా ధార హృదయాలను ఆకట్టుకుంటుంది. త్యాగరాజు, రామదాసు భక్తిమీరా వంటి మహనీయుల ప్రస్తావనలు, భక్తి తన్మయత్వం స్ఫురింపచేస్తారు.

"త్యాగరాజులా రాగాలు తీయగొంతు నీయలేదు.
రామదాసులా కోవెల కట్టపడని నీయలేదు.
గుహుడిలాగా పూజించుదామంటే నన్ను చేరలేదు.
హనుమలాగా సేవించుదామంటే నాకు కనరావు" అంటారు "న్యాయమేనా రాఘవా" భక్తి గేయంలో..

శివకేశవ భేదం లేకుండా, మాధవ మహదేవ తత్వం తెలిసికొని 'శివుడిని పూజించే గోవిందున్ని' భక్తులను కొలవవలసినదిగా కవి ప్రబోధిస్తారు. 'మోహనాంగ వెన్న దొంగ', 'ముద్దాడనా వేణువునై', 'కృష్ణతృష్ణ' 'మురళిని నేనౌతా', 'రాధికా మానస చోర', 'రాధికా నా ప్రణయ వేదిక' 'విరహిణి రాధిక' వంటి గేయాలు, 'జాతికి జాగృత గీతమే భగవద్గీత' వంటి విశిష్ట రచనలు మళ్ళీ మళ్ళీ పాటలుగా మధురానుభూతి కలిగిస్తాయి. తాను రచించిన గీతాలనన్నింటిని, 12 విషయాలుగా విభజించి, పుస్తకాలుగా ముద్రించా లనే డా॥ గొల్లపెల్లి రాంకిషన్ సత్సంకల్పం అభినందనీయం.

గీతసంపుటి 'శివమేకమ్'

డా॥ రాఖీ, భక్తి కవిగా, పాట ఊపిరిగా రాగజ్ఞాన స్వర కల్పనతో అవ్యాజ శివభక్తి తత్పరతతో వెలువరించిన 'శివమేకమ్' వారి సాహితీ ప్రస్తానంలో ఒక ఆధ్యాత్మిక మణిపూసగా భక్తులను అలరింపచేస్తోంది. "గాన సుధా సారమతి" తొలి రచనగా ''లీలలన్ని లాలిపాడి, ఊయలూపనా'' సంప్రదాయ లాలిపాటగా, వాఙ్మయరూపం లో సృజనాత్మకంగా శివతాండవ స్తుతిగా భక్తులను ఈ గీత సంకలనం ఆకట్టుకొంటోంది. భక్తి పారవశ్యంతో, పరమేశ్వరుని లీలా వైభవాన్ని పాటగా, తన్మయనంతో ఆరాధించుకొనే అద్భుత భక్తిమార్గం, ఈ భక్తిగీతాల ద్వారా డా॥ రాంకిషన్ గొల్లపెల్లి (రాఖీ) దివ్యానుభూతిగా అందించారు. 12 పుస్తకాలను ఒక్కసారిగా ముద్రించి అందించే బృహత్ సంకల్పం డా॥ రాఖీ, సామర్థ్యానికి అద్దం పడ్తోంది. "వచ్చే జన్మకైనా నువు మెచ్చే పాట పాడనీ" అంటూ కవిత్వ పటిమ, భక్తి పారవశ్యంతో కవి గేయాలన్నీ లలిత భక్తి సంగీత కళాకారుల గాన మాధుర్యానికి సుస్వరాలు అందిస్తున్నాయి. బెంగళూరు అత్యున్నత "ప్రొయిట్రీ స్కాలర్‌షిప్ ఎక్స్‌లెన్స్ అవార్డ్" వరించిన డా॥ గొల్లపెల్లి రాంకిషన్, ఈ సంపుటిలో, తన సంగీత, సాహిత్య వైదుష్యానికి, శివతత్వాన్ని ఆవిష్కరింపచేస్తారు. 'కాల రుద్రుడా వీరభద్రుడా' గేయ కవితలో, డా॥ గొల్లపెల్లి, ఘోరకలికి తెరదించమని, నేర వృత్తిని తెగటార్చమని, ఇకనైనా కన్నుతెరిచి ఆగ్రహించి లోకాన్ని అనుగ్రహించమని వీరభద్రున్ని వేడుకోవటం, కాలానుగుణ సామాజిక స్పృహను వ్యక్తం చేస్తోంది. ద్వాదశ జ్యోతిర్లింగాలను క్షేత్రమహిమలు, స్థల పురాణ గాథలు కళ్ళకు కట్టినట్లు వివరిస్తారు. **"లీలలన్ని లాలిపాడి ఊయలలూపనా మహిమలన్ని జోలపాడి నిదుర బుచ్చనా"** అంటారు.

"భజరే సాయినాథమ్" అక్షరార్చన

ఈ 'భక్తి కవిత్వ సంపుటిలో, షిరిడీ సాయి అక్షరార్చనగా 108 గీతాలున్నాయి. షిరిడిసాయి దివ్యానుభవాలు, భగవతత్వం, మూఢభక్తికి లొంగని అత్యుత్తమ బోధనలను రసవంతం, అర్థవంతమైన గీతాలుగా రచించారు. "నీ పదముల నా గీతుల తలదాల్చనా నీ పదములనే ప్రణతుల తలవాల్చనా" అంటూ బాబా అనుగ్రహమే జీవిత పరమావధిగా, మనసా శిరసా వచసా గతార్చన అందించారు. భగవంతు డైన సాయి నాథునే సద్గురువుగా విశ్వసించి, తనని ఉద్ధరించమని వేడుకొన్నాడు. **"భవజలధి దాటించే సరంగు.."** స్వామియే అంటూ **"సాటి మనిషితో ప్రియభాషణలే"** అంటూ ప్రేమాదరణలు, మానవత్వ, స్నేహ తత్వాలే బాబా జీవితం అంటూ భజరే సాయి నాథమ్" మనల్ని గీతాలతో అలరించి భక్తి పారవశ్యాలతో ముక్తిమార్గం దర్శింపచేస్తుంది. **"ప్రేమ రూపాయ విమల చిత్తదాయకాయ"** అవతరించేరు సద్గురువులు జగాన", **"గురువారం ఇది సద్గురువారం" "ఎందుకు వెళ్ళాలి సాయి షిరిడీ పురము", 'సాయి అనే నామమెంతొ హాయి" "జయ జయ జయ సాయీ అవధూత", "సాయి బాబా పల్లకి సేవ పాట"**

"పాడుట నా వంతు సాయి
కాపాడుట నీవంతు షిర్డీసాయి
వేడుట నా వంతు సాయి
నా వేదన తీర్చగ రావోయి"

డా॥ గొల్లపెల్లి రాంకిషన్ నవవిధ భక్తి మార్గాలలో భగవన్నామ సంకీర్తనా మార్గాన్ని, భగవత్పరమైన ప్రగాఢ విశ్వాసంతో ఎన్నుకొని భాషా ప్రేమికులు, భక్త సమూహాలు తన్మయత్వంతో పాట ద్వారా గీతార్చన చేసి తరించే దైవార్చన కొనసాగిస్తున్నారు. వేలాది గీతాలు, ఫేస్‌బుక్ వేదికగా ఫెంటో బృందంలో, 'లబ్ డబ్' ఫెంటో బుక్ సృష్టికర్తగా, సాహితీ ప్రస్థానం కొనసాగిస్తున్న డా॥ గొల్లపెల్లి రాంకిషన్ అభినందనీయులు. పాలపిట్ట బుక్స్ హైదరాబాద్ ప్రచురించిన ఈ భక్తి సంకీర్తనా రచనల కాపీలకు

డా॥ గొల్లపెల్లి రాంకిషన్
ఇ.నెం. 3-217/11,రోడ్ నెం. 14- నార్త్
ప్రశాంతి హిల్స్, మీర్‌పేట
హైదరాబాద్-500 097.
సెల్: 9494994896
9948989512

-జయసూర్య
సెల్: 90149 48336

అమ్మ కడుపున పుట్టిన అమ్మ

మహిళలే దేశానికి భద్రత
అమ్మ కడుపున పుట్టిన బిడ్డ
బుడి బుడి అడుగులను వేస్తూనే
ఇంతింతై ఆకాశమే
హద్దురా అంటూ
సామానత్వం చాటింది..
లోకం పెట్టె నీచపు నీడల్ని
చేరిపేస్తూ అడుగులు
గర్వంగా సాగిపోతోంది
ఆణువణువున్నా
నిర్భంద వలయాలు ఉన్నా
తన లక్ష్యం కు ప్రాణం పోస్తుంది...
మహిళకు సృష్టికారకత్వమైన
ప్రాణం పోసే సృష్టికి సృష్టి కర్త
భూదేవంత సహన శీలి
ఆకాశమంతా విశాల హృదయం
కుటుంబ లోకంలో
దశవతారల పాత్ర పోసిస్తుంది...
కాలంలో మార్పులు
యుగాల్లో మార్పులు
మనుషుల్లో మార్పులు
మహిళా సాధికారంలో
మార్పుకు అడుగులు వేస్తుంది...
గాలి ఒంటరిగా పోరాటం
నీరు ఒంటరిగా పోరాటం
నిప్పు ఒంటరిగా పోరాటం
భూమి ఒంటరిగా పోరాటం
ఆకాశం ఒంటరిగా పోరాటం
మహిళా ఒంటరిగా పోరాటం
కాని
మానవాళి మనుగడకు
మహిళలే భద్రత గా ఉంటారు...
పురిటి నొప్పులు భరించి
లోకం వికృత చేష్టలు భరించి
ఇంటి భాద్యతలు భుజాన భరించి
కన్నీళ్లు మరుగుతుంటే
మనసు వేదన పడుతుంది....
అసూయా లేని అమ్మ
ద్వేషం లేని కూతురు
ఆశలతో భవిష్యత్తు కు
బంగారు బాటకు పునాది...

-ఎలగొండ రవి
9848770345

ధరణి కంట రక్తకన్నీరు

ధరణి దద్దరిల్లుతోంది
బాంబులతో,వైమానిక దాడులతో,
బ్రద్దలవుతోంది,
ఒంటినిండా గాయాలతో,
కాయమంతా రక్తపుటేరులతో,
ధరణి రెండు కళ్లురక్తపుమరకలతో
కన్నీరులొలుకుతోంది,
అహం అనే క్రిమి మెదడుగృహాలో చేరి,
అధ్యక్షుల బుర్రను తినేస్తుంటే,
యుద్ధాన్ని ప్రకటించి,
సైన్యాన్ని పంపించి ఆకస్మికదాడులు
దొంగచాటు యుద్ధాన్ని చేస్తుంటే,
తెగబడిన ప్రజల తలలు,మెండెలు చూస్తు,
నిండు ప్రాణాలు గాలిలో
కలిసిపోయిన క్షణాల్లో,
బాధాతప్త హృదయముతో భూమి
విలవిలలాడుతోంది,
ఎవరు ఎవరుపై బయోవార్ చేస్తారో అని
భూమాత ఆసాంతం రోదిస్తోంది.
కంటికి కనబడని క్రొత్త వైరస్సులు,
సరస్సుల్లో పుట్టిన విషపు జంతువుల్లా
పుట్టుకొచ్చి, మానవాళికి ఏ ప్రమాదం
తెస్తాయోనని ధరణీమాత గుండె
దడదడలాడుతోంది
మనిషి విజ్ఞానం మానవాళి భద్రతకా,
మానవాళి ముంపునకా అని ,
నివ్వెరపోతుంది
ధరణి కంట కన్నీరు కార్చొద్దు
భూమాత గుండెకు చిల్లులు పెట్టొద్దు
రష్యా,ఉక్రెయిన్ ల మధ్య పోరు
కాకుడదు మానవాళికి పోరు,
వివాదాలని,అహంని ప్రక్కనపెట్టి,
మనిషి మనుగడకై మార్గం చూపండి
యుద్ధంతో సాధించినది ఏమిలేదు,
యుద్ధం పరిసమాప్తమే మానవ శ్రేయస్సు
ధరణికి ఉషస్సు

-విశ్వనాథ
నరసింహం
9490971589

ప్రపంచ ఇంద్రజాలికులారా..

ప్రపంచ ఇంద్రజాలికులారా ఏకంకండి
మీ కనికట్టుకు, హస్తలాఘవానికి పనిపడింది
ప్రపంచమంతా మీ కళను కళ్ళారా చూసి దిక్కులు
దద్దరిల్లే చప్పట్లతో ప్రశంసించే సమయం వచ్చింది
రష్యా ప్రయోగించే క్షిపణులను
దీపావళి తారాజువ్వలుగా నేలకు రాల్చండి
జనావాసాలపై వేసే బాంబులను
పువ్వులుగా మార్చండి
ఆకలితో అలమటించే సైనిక, సామాన్య జనం ముందు
అక్షయపాత్రలు పరవండి
భయంతో బిక్కుబిక్కుమంటున్న మనసులను మాయచేసి
మరో మహాద్భుత లోకంలో సేదదీర్చండి
అరుపులు, కేకలతో భయానకంగా ఉన్న పరిసరాల్లో
బిక్కచచ్చిపోయిన పసితనానికి
బొమ్మలు, బిస్కెట్లు పంచండి
ఉక్రెయిన్లోని ఇతర దేశస్థులను
పుష్పక విమానాలు, అల్లాద్దీన్ ఛాదర్లతో
వాళ్ళ కుటుంబాలకు క్షేమంగా చేర్చండి
యుద్ధవాతావరణాన్ని ప్రశాంతపరచి
శాంతి కపోతాలు ఎగిరేల చేయండి!

-ప్రతాప వెంకట సుబ్బారాయుడు
9393981918

అమ్మ (కథ)

అనురాధ లక్ష్మి రాజేష్ ల గారాల పట్టి ,కొత్తగా పెళ్లి చేసి అత్తారింటికి పంపారు. ఒక్కతే కూతురు కావడంతో కష్టమనేది తెలియకుండా పెంచారు దాంతో చాలా పెంకి గా తయారైంది. అన్వేష్ అను భర్త. చాలా నెమ్మదస్తుడు . పెళ్లయిన వారానికి వేరు కాపురం వెళ్లాలన్నా అనురాధ పట్టుదలతో బెంగళూరులో అద్దెకు ఇల్లు తీసుకున్నాడు .సాఫ్ట్వేర్ గా పనిచేస్తున్న అన్వేష్ కి సంపాదన బాగానే ఉంది. అనురాధ ఉద్యోగం చేయాలనే ఇంట్రెస్ట్ చూపకపోవడంతో తనను బలవంతం చేయలేదు ఎప్పుడు చూసినా సెల్ పట్టుకు కూర్చునేది ఇంట్లో పనులు పట్టించుకునేది కాదు సమయానికి వండి కూడా పెట్టేది కాదు. అయినప్పటికీ సహన వంతుడైన అన్వేష్ ఏమీ అనలేక నిట్టూర్పు సెగలు వెళ్ళగక్కుతూ కాలం వెళ్లదీస్తున్నాడు. ఇలా ఉండగా అనురాధ నీళ్లోసుకుంది. ఇక చూడు అప్పటి నుండి మంచం దిగేది కాదు ప్రతి చిన్న విషయానికి గొడవ పడేది.అన్నీ చీత్కారాలే..పెడసర సమాధానం చెప్పేది. గర్భవతిగా ఉన్నప్పుడు ప్రశాంతంగా ఉంటే బిడ్డ ఎదుగుదల బాగుంటుంది అని తన తల్లి చెప్పిన మాటలు గుర్తొచ్చి సర్దుకుపోయే వాడు రోజురోజుకు అనురాధ గొంతెమ్మ కోరికలు తీర్చ లేక తనకు మేలుకొలుపులు పాడలేక నానా అవస్థలు పడే వాడు. ఇలా ఉండగా లక్ష్మీ రాజేష్ లు తన బిడ్డను చూసి పోదామని బెంగళూరుకు వచ్చారు. అనురాధ అన్వేష్ ల మధ్య ఏదో వెలితి ఉందని లక్ష్మి గ్రహించింది. అల్లుడు టిఫిన్ ఆర్డరు చేయడం మధ్యాహ్నం భోజనం జొమాటో లో ఆర్డర్ చేయడం గమనించింది .ఇంత చేస్తున్న కూతురు మంచం దిగకుండా ఫోన్లో గడపడం విచిత్రంగా అనిపించింది పైగా అతని పైన కేకలు వేయడం అంత సబబుగా తోచలేదు. అదే విషయం చిన్నగా కూతురుతో కదిపింది. మంచివాడని బాగా సంపాదిస్తున్నాడు అని పెళ్లి చేసి అనవసరంగా నా గొంతు కోశారు అమెరికా సంబంధం చేయమంటే నన్ను వదిలి ఉండలేను అని నానా యాగీ చేసి ఎన్నో పోరాటాలు నాపై ప్రకటించి చివరకు మీరు అనుకున్నట్లు ఇతనితో పెళ్లి చేశారు అంటూ గయ్ మంది. ఒక ముద్దు లేదు ...ముచ్చట లేదు... నా ఫ్రెండు రవళిని చూడు నౌకర్లు చాకర్లు తో మహారాణిలా ఉంది .అలా సరదాగాఊటి కొడైకెనాల్ వెళ్ళొద్దాం అంటే వాళ్ళ చెల్లెలు చదువుల బాధ్యత తనపై ఉందట. వృధా ఖర్చులు పెట్టలేడటా.. పెళ్ళాం సరదా తీర్చలేని భర్తకూడ భర్తేనా అంటూ మూతి విరిచింది. అంతా విన్న లక్ష్మి కి తన కాళ్ళ కింద భూమి కంపించి నట్టు అనిపించింది నా బిడ్డవు కనుక నిన్ను ఏమీ అనలేకున్నాను. ఒక బిడ్డ వని గారాబం చేసి తప్పు చేశాను అనిపిస్తుంది. మేము పడిన కష్టాలు జీవితంలో నిలబడడానికి చేసిన ఎన్నో పోరాటాలు నీకు తెలియకుండా దాచి పొరపాటు చేశాను. మేము కర్షకులం రెక్కాడితేగాని డొక్కాడని మేము పడిన శ్రమ,పాడిన శ్రమ గీతాలు నీ చెవిన చిన్నప్పుడే పడి ఉంటే నీకు మనిషి విలువ ,మనసు విలువ తెలిసి ఉండేది. నీవు రవళి సంపద మాత్రమే చూస్తున్నావ్ తన భర్త పెట్టే హింస గురించి నీకు తెలియదు .అనూ! దూరపు కొండలు నునుపు గానే కనబడుతాయి. నీవు ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా ఒక్క మాట కూడా నిన్ను అనకుండా చూసుకుంటున్నా నీ భర్త స్థానంలో కాసేపు నిలబడి ఆలోచించు. చుట్టుపక్కల ఆడవాళ్ళని గమనించావా ఉదయం లేచి ఎన్ని పాట్లు పడుతున్నారో. అర్థం చేసుకో నీ భర్త హృదయంలో నీవే రాణివి దాబులకు పోయి పచ్చని సంసారాన్ని పాడు చేసుకోకు. నిన్ను సంతోషంగా ఉంచడం కోసం నీ భర్త ఎంత బాధను దిగమింగుతున్నాడో ఆలోచించుకో. తల్లిని నీ మంచి కోసమే చెప్తానని అర్థం చేసుకో అంటూ అనునయంగా చెప్పడంతో అనురాధ ఆలోచనలో పడింది. భార్య ప్రవర్తన లో వచ్చిన మార్పు చూసి అన్వేష్ ఆనందించాడు అత్తమామలకు మనసులోనే నమస్కరించాడు.

-సి.హేమలత
9666779103

కథలు నిజం చేస్తున్న సైన్స్

నిన్నటి కథలను
నేడు నిజమని చెప్పే సైన్స్
చీకటిని బాపుచు
వెలుగులు నింపుచున్నది సైన్స్.

ఆటవిక జీవితము బాపి
అంతరిక్షానికి పంపుచున్నది సైన్స్
నీటి వేగాన్ని ఆపుచు
విద్యుత్తుగ మార్చుతున్నది సైన్స్.

చక్రాలను సృష్టించి
పరుగుల యంత్రాలను చేస్తున్నది సైన్స్
గాలికంటె వేగంగ పయనిస్తు
గగన తలంలో నడిపిస్తున్నది సైన్స్.

పుట్టుక నియమాలను తెలిపి
పురుడు పోస్తున్నది సైన్స్
భోగాల నదుపుచేయ
రోగాల గుట్టు తెలుపుచున్నది సైన్స్.

రోబోలను నడిపిస్తు
మరమనుషుల లోకాన్ని సృష్టిస్తున్నది సైన్స్
సెల్లు ఫోను చేతిలో పెట్టి
విశ్వాన్ని చూపుచున్నది సైన్స్.

ఇంటర్నెట్ కనిపెట్టి
ఇంట్లోనే చదివేలా చేస్తున్నది సైన్స్
వంట్లోని రోగాలను తెలిపి
కంట్లో ఆనంద కాంతులు
నింపుచున్నది సైన్స్

సూర్యున్నే తయారు చేసి
కొత్త వెలుగులు పంచుతున్నది సైన్స్
భూమి పోరలను ఛేదించి
మనిషి పుట్టుకను
తెలుపుచున్నది సైన్స్

-బి.సుధాకర్
9849243908

కొత్తదారి

నది ఒడ్డున ఒంటరిగా నడుస్తున్న.
ఎదలో బండరాయిలాంటి బాధలను మోస్తూ.
మనసంతా పరుగెడుతుంది...
పగ్గాల్లేని గుర్రపు స్వారిచేస్తూ.
నీరంతా నిచ్చలంగా ఉండి నన్నే గమనిస్తుంది.

మెల్లిగా అలలన్నీ వచ్చి...
నా పాదాలను తాకుతున్నాయి.
ఏదో తెలియని పులకరింత హృదయంలో.
పిచ్చిగా ఉరకలేస్తున్న మనసు...
కాస్త తెలికపడుతుంది.
చీకట్లు కమ్ముకున్న నాలో
చెకుముఖిరాయి రాపిడి జరిపి
కొన్ని నిప్పుకనికలను వెదజల్లి
వెలుగుకిరణాలను పూయిస్తూ..
నాకో కొత్తదారిని చూపిస్తున్నాయి.

నదిపై నుండి వస్తున్న గాలి...
రివ్వున విస్తూ నా తనువును తాకుతుంది.
నన్నలా ముందుకు నెట్టుతూ....
నాకో మాటచెబుతుంది నా చెవిలో.
తనలా పరుగెత్తమని.

ప్రకృతి అంతా పచ్చనైన తివాచీ పరిచి
నన్ను ఆహ్వానిస్తుంది అక్కున చేర్చుకుంటుంది.
ఎండిన గుండెకు కాస్తంత నీటి తడి దొరికట్లు
చినుకులు కురుస్తున్నాయి చిరుజల్లుల్లా.
బాదలన్ని మంచు గడ్డలా కరిగిపోతున్నాయి.

ఎదో తెలియని ఉత్తేజం నాలో ఉరకలేస్తుంది.
కొత్త ఆలోచనల పర్వం మొదలైంది.
ఉన్నత శిఖరాల వైపు దారేదో కనిపిస్తుంది.
నా పాదాలు కదులుతున్నాయి అటువైపుగా.
నా హృదయంలో ప్రయత్నపు
మొలకలు మోలుస్తున్నాయి.
అవి తరువులై ఫలాలను ఇస్తున్నాయి.
ఆకలి మంటలను చల్లారుస్తున్నాయి.
కొత్తదారిని చూపుతున్నాయి.

-అశోక్ గోనె
9441317361

బ్రతికించుకుందాం!

వినీలాకాశంలో ధ్రువతారలా..
వెలుగొందిన విశ్వాసం..
ఎడారిలో ఒయాసిస్ లా
దాహార్తిని తీర్చిన విశ్వాసం..
మండుటెండలో సేద తీర్చే
వేపవృక్షం లాంటి విశ్వాసం..
నేడు కనుమరుగౌతుంది.
మనిషి.. "మహిషి" గా మారుతుంటే..

ధన మదంతో..
అధికార దాహంతో..
మనిషి నైతిక విలువలు కోల్పోతూ....
విశ్వాసాన్ని అహంకారంతో సమాధి చేస్తుంటే..
నిస్సత్తువగా చూస్తున్న కొందరి కోసం.
ఎవ్వరూ పై లోకం నుండి దిగిరారు !
భ్రమలు వీడ వలసినది,
వాస్తవంలో జీవించ వలసినది కూడా మనమే!

విశ్వాసానికి జవసత్వాలు నింపవలసినది,
రేపటి తరాలకు అందించ వలసినది
కూడా మనమే.!
అందుకే ప్రతి ఒక్కరం నిజాయితీకి పట్టం కడదాం!
విశ్వాసాన్ని బ్రతికించుకుందాం..!!

-రాము కోలా
9849001201

బడి మొగ్గలు

పసి హృదయాలను నిత్యం వికసింపచేస్తూ
ఆనంద వేదికకు ఆనవాలు అయ్యేది
ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే యాగశాల 'బడి'

ప్రపంచ జ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిస్తూ
బాలల భవితవ్యానికి దిశా నిర్దేశం చేసేది
శాస్త్రవేత్తలను తయారు చేసే ప్రయోగశాల 'బడి'

ఎంత ఎదిగినా ఒదిగి ఉండే గుణాన్ని అలవరిస్తూ
ఒడిదుడుకులను ఎదుర్కునే మనోధైర్యాన్నిచ్చేది
ప్రేమ, వాత్సల్యానికి నిలువెత్తు పర్ణశాల 'బడి'

అంతర్గతంగా ఉన్న నై

ఏడోచంద్రుడి.. రావిశాస్త్రీయం

'శ్రీకాకుళం' పదం ఉచ్చరిస్తేనే తెలుగు రాజకీయాల లోనూ కాదు, తెలుగు సాహిత్యంలో కూడా ఒక ఉత్తేజ భావ చలన అలజడి దృశ్యాంతమౌ తుంది. చరిత మలుపుకు ఒక కొత్త మార్పుకు అంకురార్పణ.

వంశధారనది అలలు, కాలానికి ఇచ్చి గొప్ప కానుక రాచకొండ వెంకటప్రసాద విశ్వనాథశాస్త్రి. తెలుగు సాహిత్యం చీకటి కోణంకు వణుకు పుట్టించి, కొత్త వెలుగు ప్రస్తానానికి దారి వెతుక్కుంటున్న కాలం అది. చాదీస్తు సంప్రదాయాలపై తిరుగుబాటు. వర్గ భావజాల యుద్ధం. అనివార్యంగా తెలుగు సాహిత్యంలోకి వచ్చిన చరిత్రాత్మక ఘటం అది.

గురజాడ.. శ్రీశ్రీల మహాపర్వత శిఖరాగ్ర వారసత్వ అడుగుల కోసం, కడుపుతో వున్న కాలానికి కానుకనే శ్రీశ్రీ నోటి జనన పదం శ్రీకారం చుట్టుకున్న, శ్రీకాకుళం వంశధారనది అలల పురటినొప్పుల కేకనే మహ రచయిత రావిశాస్త్రి (అంత వరకు అయిదు ఆరు కలం పేర్లతో...)

సైకిల్ కోసం మారం చేసిన బాల్యం వీపు మీద తల్లి ఒక గ్రుడ్డు గుద్ది 'ఓరేయ్ విశ్వం మనం బీదవాళ్లమేవ' తల్లి మాటలు ఎందుకో



బాల్యంలోనే మార్క్సిజం ఛాయలు ఇంజెక్టు చేసినట్లు వుంది. తల్లి వాక్యం తన జీవిత నౌక నీడలో, సాహిత్యంలో, తన లాయర్ వృత్తిలో, తరచూ ఒక స్వప్నంల, తన శకం చివరి వరకు వెంటాడుతూనే వచ్చింది.

ఒక నది ప్రాంత జననం నుంచి, ఒక సముద్ర నగర జీవనంలోకి. ఒక తరం అయింది రావిశాస్త్రికి. అక్కడే మహారచయితలు కవులు, పరిచయాలు, వారి ప్రభావం ప్రాపంచిక దృక్పథానికి రహదారి అయింది. డెబ్బై ఒక ఏళ్ల చివరి మజిలిలోంచి, ఓ పదిఏళ్లు ప్రక్కన పెడితే అరవై ఒక్క ఏళ్లు, తన జీవిత ప్రస్తావనమంతా, సాహిత్యం విలువలతో కూడిన జీవితం, జీవితంలోని తన వృత్తి, ధర్మం. ఒకదానికి కొకటి పోటాపోటి పడుతూ, ఒక కొత్త సమాజానికి వెలుగు ప్రసాదించింది.

బీద ప్రజలు అందరూ ఆ రోజుల్లోనే అతడిని గరిబోళ్ల 'వాకిల్‌సాబ్' అని హృదయాంతరంలోంచి, పిలుచుకునే వారు. సామాన్యులను, రాజకీయ నాయకులు, దళారులు ఎలా ఉపయోగించుకొని, తమ స్వార్థపనులు చేయించుకునే వారో తనూ చూసింది తనూ వారి తరఫున వకిల్‌గా వాదించిన న్యాయం కళ్లువున్న గాంధారినిలా ఎలా కళ్లకు గంతలు కట్టుకోని ఎవరి తరఫున తీర్పులు చేపుతుందో, తన రచనల ద్వారా సమాజానికి కళ్లకు కట్టినట్లు చూపించిందు రావిశాస్త్రి!

న్యాయమూర్తి (జడ్జి) నరసింగరావు 'బీనాదేవి' కలం పేరుతో సాహిత్యంలోకి రావడానికి, ముఖ్యప్రేరణ కరదీపిక. రావిశాస్త్రి జీవితం-సాహిత్యమే-రచయితలకు స్పష్టమైన వర్గ చూపు వుండాలి అని ఆనాడు చరిత్రాత్మాకంగా ఆవిర్భవించిన 'విరసం'నికి అధ్యక్షుడిగా శ్రీశ్రీకాగా, ఉపాధ్యాక్షులుగా రావిశాస్త్రి, కాళీపట్నం రామారావు వుండటం, తెలుగు సాహితీలోకంకి ఒక దిక్సూచి అది. అప్పుడప్పుడె అడుగులు వేస్తున్న యువ కవులకు, రచయితలకు, ఒక గొప్ప చలన ఉత్తేజ గీతిక.

నా మాటకి వస్తే1972లో రాసిన తొలికథ పత్రికలో అచ్చుఅయి, కనిపించకుండా తప్పిపోయిన 'చాక్లెటల స్వాతంత్ర్యం" కథకు ఒక రకంగా రావిశాస్త్రి విరసం ప్రభావమే.

మానవ సమాజం, మధ్య తరగతి జీవితాలు గురించి రాజ్యహింసపై నాకు తెలిసి ఏకదాటిగా రాసి పోరాడిన ఒకే ఒక్కడు రావిశాస్త్రి అనుకుంటా-

"పోలీసు స్టేషన్ లేని ఊరు- తలుపులు లేని ఇల్లు" లాంటి దేశం చూడాలన్న కలల కార్యశీలతకు కలం పట్టిన ఏడో చంద్రుడు రావిశాస్త్రి.

రాజ్యం నిర్బంధంపై, వాదించిన గొప్ప రచయిత వకీల్‌సాబ్, తానుకుడా రాజహింసకు అతితుడు కానట్లు ఏమర్జెన్సీ చీకటి రోజులలో జైలు జీవితం గడిపిన మొదటి తెలుగు రచయిత, ఒకటిన్నర సంవత్సరం జైలులో వున్న, జైళ్లలో కూడా, కరపత్రాలు, వ్యాసాలు.. అత్యవసర పరిస్థితులపై వ్యాసాలు రాసిన ధీర రచయిత.

నిబద్ధతకు నిలువుటద్దంగా 'జాతక ఫలాలు' అన్న ఒక బలహీనతలకు 'విరసం'నికి రాజీనామా చేసిన, చివరి అంట 'విరసం'కు నీడగా, అండగా వుంటూ వచ్చిందు.

సప్తమినాడు పుట్టినందుకు శ్రీశ్రీ అనంతంలా ఏడో చంద్రుడు పేరా మరో గొప్ప అనంతం అంది వుండేది తెలుగు సాహిత్యలోకానికి కాని ప్రారంభంలోనే తన శ్వాస శబ్దం విశ్వానికి విడిచి (కిడ్నీ వ్యాధితో) గాఢనిద్రలోకి వెళ్లిపోయాడు రావిశాస్త్రి.

ఎవరు జీవించి వుంటారు వందేళ్లు! రావిశాస్త్రి ఉంటాడు కదా మన గుండెనిండా నూరేళ్లు! ఈ దోపిడి రాజ్యం ఉన్నంత వరకు వుంటాడు కదా మరో వందేళ్లు!

అల్పజీవి-గోవులోస్తున్నయ్ జాగ్రత్త- రాజు-మనిషి, నల్ల అంచు తెల్లచీర, అనేకం, అతడి గల్పికలు, కథలు, పీఠిక వ్యాసాలు, నవలలు, అనేక అనేకం అతడి ప్రయోగ అక్షర శిల్పాలు మనముందు వున్న దర్పణీయం! ముందు తరంకి క్రాంతిణీయం!!

(రావిశాస్త్రి శతజయంతి సందర్భంలో...)

-జనజ్వాల
సెల్: 9949163770

ఊపిరి పోయాలిప్పుడు....

ఎన్ని అనుభూతులను అక్షరాలుగా మలచాలో...
ఎన్ని సంఘర్షణలకు సక్రమ రూపునివ్వాలో....
నాలోని నాకు ప్రతిబింబమైన
నిన్ను నిన్నుగా పుట్టించుటకు..
వేనోళ్ళు నీ జన్మను పొగుడుటకు...

ఆలోచనై అంకురించిన నీకు
జీవం పోయుటకు
నా ఆశలే నీ శ్వాసగా మార్చి...
నా ఎదస్పందనే ఆహారంగా ఇచ్చి...

ఎంత ఆర్ద్రతను జీవామృతంగా పట్టించాలో....
ఎన్నిభావాల ఉమ్మనీటిలో ఆడించాలో...

అంతేగా మరి...
ప్రాణంలేని వాక్యాలను ప్రసవించే కన్నా...
ప్రతి గుండెను తడిమే జీవకావ్యంగా
ప్రతిమదిలో మెదిలే అద్భుత సందేశంగా
నీకూపిరి పోయాలిప్పుడు...

వేల గొంతుకలను పుణికిపుచ్చుకున్న చైతన్యగీతమై....
సమాజహితమే నీ ధృడసంకల్పమై..
కవనకన్యకలా నీవు ఉద్భవించాలిప్పుడు....

-స్వప్నకృష్ణ.
9440536669

అర్ధాంగి అంతరంగం

కాలగర్భంలో కలిసిపోతున్న అబలల కథనం
కన్నీటితో విరచించిన ఈ నా కవనం.
కట్టుకున్న భర్త కాల యముడై
కంఠాన్ని కాలపాశంతో బందిస్తే
కలికి కన్నుల పొంగే కన్నీటి మంట
కరిగించదా కరడుగట్టిన కర్కశుడిని.
నాతి చరామి అని పలికిన నోట
నీచమైన మాటలతో దుర్భాషలాడితే
నారీమణి నిశబ్ద నయన జలాశయం
నిలువునా ముంచేయదా నిర్దయుడిని.
అగ్నిసాక్షిగా ఏడుఅడుగులు నడిపించిన
అనురాగ కరములు కొరడా అయితే
అతివల అంతరంగ ఆత్మాభిమానం
అగుపించదా అహంకార అవకాశవాదికి.
మగువను విలాస వస్తువుగా తలచి
మనసు లేని మరయంత్రంగా మారిస్తే
మాలిని మదిలో సాగే మౌన పోరాటం
మధించదా మత్తెక్కిన మృగ రాజుని.
ఇది కాదు ఈనాటి చరిత్ర మాత్రం
ఇదే తరాలుగా తరుణికి ఇస్తున్న గౌరవం
ఇకపైన మారాలి ఇలాంటి మగవారి దృక్పథం
ఇకనైన అర్థం కావాలి అర్ధాంగి అంతరంగం
ఇపుడైనా తెలుసుకోవాలి అర్ధనారీశ్వర తత్వం
అర్ధాంగికి నిర్వచనం అర్ధనారీశ్వరం

ఆలూమగల సమానత్వానికి సంకేతం
అనురాగ అనుబంధానికి నిదర్శనం
ఆదర్శ దాంపత్యానికి ప్రవచనం
అర్ధనారీశ్వరమే
వివాహబంధంకి మార్గదర్శకం.

- కందాళం రజనీకృష్ణ
సెల్:9487708043

ప్రజాస్వామ్యం పరధవిల్లాలిరా.!

ఓటుకు నోటుకై
నాయకులిచ్చే ముందుకై
మత్తులో తూలావంటే
మేక వన్నె పులులు
జీవితాన్ని కాళరాస్తాయిరా..!

శకుని వ్యూహాలతో
కాకలు తీరిన ఉద్ధండులతో
ఓటర్లకు ఎరవేసి
కుర్చీని లాగేసుకుని
నెత్తిపైకెక్కి నాట్యం చేస్తారురా..!

మన ఓటుతో గెలిచి
నోట్లో మట్టి కొట్టి
వెన్నుపోటు పొడిచే
మోసకారి నేతలను
పాతాళానికి తొక్కరా..!

మశకాసుర దోపిడీపై
విచక్షణనే విల్లు ఎక్కుపెట్టి
ఓటనే ఆయుధాన్ని సంధించి
ప్రజాస్వామ్య పరిమళాలను
పరధవింప జేయరా..!

-పిల్లి.హజరత్తయ్య,
9848606573

తెలుగు నుడి మధురం

తేటగీతి.మాతృభాష తెలుగు గూర్చి మౌనమేల
తెలుగు వారికే ల నుడిపై తెగులు బుట్టె
మనకు ప్రభుత కు తెలుగుపై మనసు లేదు
జాను తెలుగందు తెలుగోడి జాడ యేది.

మమ్మియని పిలువ మురిసేనమ్మ నేడు
తండ్రిని ట దాడి యనగానె దర్ప మాయె
అత్త పిన్నియో తెలియదు ఆంటి యనిన
అచ్చ తెలుగు మాటాడిన నచ్చదాయె.

తల్లి సున్నము పిన్నిట బెల్ల మాయె
ఆంగ్ల భాష మాట్లాడిన హాయి గలుగు
మనల తెలుగు మాటాడగ మనసు రాదు
యేమి ఖర్మమో తెలు గన్న లేమి చూపు.

సంస్కృతంబు లోని మధుర సారమంది
అరవ భాష నుండి నుడుల నందమొంది
కన్నడంపు కస్తూరికా వన్నెలంది
పర నుడుల మాటలను కూడి పరవశించు
కమ్మనైన తెలుగు మన అమ్మ నుడిర

భాషయనిన తమిళులకు ప్రాణ మాయె
మహిమరాటీల భాషపై మమత జూడు
కన్నడిగులకు భాషయే కల్పవల్లి
ఉ త్తరాదులకిందీయె యూపిరాయె
వారి జూసైన మనవారు మార రేమి!?

-రాఘవ మాస్టారు

డా॥ సముద్రాల శ్రీదేవి- 'మృగనయని' గజల్స్ సంపుటి



డా॥ సముద్రాల శ్రీదేవి అందమైన హృదయం వున్న గజళ్ళ కవయిత్రిగా, 'మృగనయని' గజల్స్ సంపుటికి శీర్షిక, అందమైన కళ్ళున్న సౌందర్య ప్రతీకగా ఆవిష్కరింప చేసారు. ఈ గజల్ కావ్యంలో 60 భావగర్భిత రేఖాచిత్రాలతో, 531 గజళ్ళు చోటు చేసుకొన్నాయి. ప్రతీ పుటలో 9 గజళ్ళ చొప్పున మత్లాలను మెరుపు తీగలా మెరిపించి, గజళ్ళ మహారాణి ప్రశంసలందుకొన్నారు. ప్రకృతి రమణీయత, వస్తు వైవిధ్యం, ధ్వని చమత్కారం, సున్నిత అభివ్యక్తి భావన, శిల్ప సోయగం పుష్పలంగా వున్నాయి.

'చదువుతున్న జనాలనే కదిలించే అద్భుతము గజలీయత శ్రీదేవికి నిండా ఉంది చూడరా' అంటూ కేవలం ప్రేమ, విరహంలాంటి వస్తువులేగాక రాజకీయాలు, చరవాణి, కరోన, మానవ సంబంధాలు, ప్రకృతి, అమ్మ వంటి అంశాలపై సరికొత్త భావ పరిమళాలు వెదజల్లారు.

'కన్నీటిని ధారవోస్తే కలలన్నీ పండలేవు
చేపలకు ఎరవేస్తే వలలన్నీ పండలేవు' తో ఆరంభించి, 'పదాలన్ని సంగమించి భావాలే వెల్లడైన పగలైనను రాత్రైనను కునకదాయె ఓ మనసా' అంటారు ఆఖరి పుటలో.

'నమ్మికనే మాటలోనే దాగిందీ వెన్నుపోటు
మనిషిలోని కన్నీటిని తాగిందీ వెన్నుపోటు' అంటారు.

తెలుగు మాతృభాషపై రాసిన గజల్‌లో కవయిత్రి 'తియ్యదనం మెదడులోకి వంచు భాష తెలుగురా/ చమత్కార మధురిమలను పంచు భాష తెలుగురా!' అంటారు.

ఇలా వస్తువేదైనా, తన అనుభూతిని గజల్‌గా సృష్టించగల కవితాశక్తి కవయిత్రి అద్భుతంగా ప్రదర్శించారు.

'ముడుచుకొన్న పద్మంలో వాదాన్నే పలికిస్తూ
బ్రతకాలనే కాంక్షవున్న భ్రమరాన్నే చూడాలి'
అంటారు డా॥ శ్రీదేవి. ప్రతీ పుటలో ఆఖరి గజల్‌లో శ్రీదేవి ప్రస్తావన వుండటం ఈ సంపుటిలో ఒక విశేషం. ఆ మకుటపదం పేర్కొనటంలో వాక్య అనుసంధానంలో అస్పష్టతను కవయిత్రి పట్టించు కోలేదు. ఏది ఏమైనా కళారత్న బిక్కి కృష్ణ ఉదహరించినట్టుగా తెలుగు గజల్ సాహిత్య హారంలో, శ్రీదేవి గజల్స్ సంపుటి మణిపూస. మధురభావాల సుమ నోహర,రస సౌందర్యకళికగా 'మృనయని' గజల్స్ సంపుటి ఆకట్టుకొంటోంది.

ప్రతులకు: డా॥సముద్రాల శ్రీదేవి
వై/ఆఫ్. సుధీర్‌కుమార్
ఫ్లాట్ నెం. 102, ఇ.నెం. 4-84/1
విజయ్‌నివాస్ అపార్టుమెంట్
దుర్గానగర్, దిల్‌సుఖ్‌నగర్
రంగారెడ్డి జిల్లా,
హైదరాబాద్-500060
సెల్: 9949837743

-జయసూర్య
సెల్: 90149 48336
9440664610

వీలునామా

ఏదో ఆనవాయితీగా ప్రతి సంవత్సరం వస్తుంటావు
నువ్వు వస్తే మాకు ఎంతో ఆనందం కలుగుతుంది
గతపు కష్టాల నుంచి గట్టెక్కించి కొత్త వెలుగులిస్తావని
గాదెలు నిండకపోయినా గంపెడాశలు నింపుకుంటూ
గత వర్షపు ఎండమావిలో కనిపించని వాసచుక్కలు
నువ్వు కడవలతో మోసుకొస్తావని చిరు ఆశతో
మోయలేని అప్పుల బరువులను తలపై పెట్టుకుని కూడ
నీకోసం ముంగిట రంగవల్లులు దిద్దుతాడు
మామిడితోరణాల ద్వారాలను అలంకరిస్తాడు
షడ్రసోపేత భోజనానికి నోచుకోకున్నా
షడ్రుచుల పచ్చడినే
షడ్రసోపేతంగా తలచి భుజిస్తాడు
జీర్ణవస్త్రాలకే అతుకులద్ది కొత్తబట్టని మురుస్తాడు
దళారులు దోచుకోగా మిగిలిన వరిబియ్యాన్ని వండి
తొలి పండుగనాడు తెల్ల భోజనమని తృప్తి పడతాడు
పంచాగశ్రవణాలు అతనికి పట్టవు
ఆదాయ, వ్యయాల ఊసే తెలియదు
రాశిఫలాల మీద ధ్యాసే లేదు
ఏరువాక కోసం ఎదురుచూస్తూ
తొలకరి వరమిస్తే, నేలను దున్ని పంటను పండించి
పదిమంది కడుపులు నింపాలకునే నిస్వార్థజీవికి
ఏ ఏటికాయేడు తుడవలేని
కన్నీటిని మిగులుస్తావెందుకు?
ఆగర్భ కుచేలుని చేసి ఆటలాడుతావెందుకు?
అన్నం పెట్టే చేతిని అడుక్కునే చేతిని చేస్తావెందుకు?
డబ్బున్నవారికే డబ్బులు పెంచే ఉగాదిలక్ష్మీ
ఈ వత్సరమైనా మా అన్నదాతను కనికరించు
చెక్కలిపై ఆరని కన్నీటి చారికలను తుడుచుకోనివ్వు
కరోనాతో, కరువుతో అల్లాడిన జీవితాలకు
పంటచేను సంపద వీలునామాను
నీ చేవ్రాలుతో వ్రాసి
నేలబిడ్డడికి కానుకగా అందివ్వు....

-శింగరాజు శ్రీనివాసరావు
9052048706

భూత దయ చూపండి

నీరు లేక తాపం
నీరు దొరకక
తల్లడిల్లుతున్న
పక్షులు ఎన్నో
మూగ జీవులు
వేసవి తాపం తట్టుకోలేక
చనిపోవు జీవులు ఎన్నో
వృధా చేయకు నీరు
నీరు జీవనాధారం
పక్షుల కోసం
పాత్రలలో నీళ్లు ఉంచుదాం
భూతదయ చాటుదాం
పెంపుడు కుక్కలే కాదు
వీధిలో ఉన్న కుక్కలు
పశువుల కు నీరు
ఇద్దాం
మానవత్వపు మొగ్గలు
తొడుగుదాం

-ఉమాశేషారావు వైద్య
9440408080

వుస్తక సమీక్షలు

బోల్డు అండ్ బ్యూటిఫుల్ కథలు



రచయిత్రి ఇందిర వెల్ది వృత్తిరిత్యా వాణిజ్య పన్నుల అధికారిణి. ప్రవృత్తిరిత్యా మానవీయ కోణాలు స్పృశించగలిగే మంచి కథలు వ్రాయగలిగిన రచయిత్రి. వృత్తిరిత్యా ఆసామీ (Assessee) ధనాగారంలోంచి కర్షణంగానైనా, డబ్బులు రాల్చుకోగల ప్రభుత్వోద్యోగిని, ప్రవృత్తిరిత్యా 'నిర్మాస్తస్ ఆర్నోరిట్రిస్టిస్' (పారిజాతము) పూవు అంతటి కోమలత్వంతో సాహితీప్రియుల మనసు తాకగల మంచి రచయిత్రి. అమ్మమ్మ నేర్పిన తిరగలి పాటలు పాడుతారు. గాన కోకిల సుశీలగారు పాడిన పాటలు కూడా అంతే 'ఈజ్'తో పాడుతారు. కామర్స్ పట్టభద్రురాలు. అయినా, అతి చిన్న పుష్పం 'ఉల్ఫియా' తెలుసును. అతిపెద్ద పుష్పం రఫ్లేషియా కూడా రచయిత్రికి పరిచయమే! భిన్న ప్రవృత్తులు ఏకకాలంలో తనలో ఇముడ్చుకుని సృష్టిసౌందర్యాన్ని కవితామయం చేయగల నేర్పు ఉంది. సామాన్య సన్నివేశాలను సైతం కళాత్మకం చేయగల సృజనాత్మకతా ఉంది. వీరు నలుగురు నడిచే త్రోవన నడుస్తూ, ప్రేమ, విరహం, త్యాగం, మూల వస్తువులుగా చేసికుని కథలు రాయరు. వాటిని భిన్నమైన కోణంలోంచి తాను చూస్తూ పాఠకులకై వైవిధ్యమైన సంఘటనల సమాహారాన్ని సృష్టిస్తారు.

'ఆనందలోకం' కథల సంపుటి రచయిత్రి ఇందిక వెల్ది గారికిది ప్రథమ కథాహారం. అయినా చేయి తిరిగిన రచయిత్రిలా కథల్ని నడిపించారు. ఈ సంపుటిలో 9 కథలున్నాయి ఇవన్నీ వైవిధ్యమైన ఇతివృత్తాలతో అలరారుతాయి.

విద్యార్థి దశలో ఇంటి తరువాత ఎక్కువ సమయం గడిపేది బడిలోనే.

ఇంట్లో అమ్మంటే భయము. భక్తి. పదవ తరగతి ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో గణితం బోధించే పెద్దరాములు సార్ అన్నా భయము. భక్తే! కాలేయ రోగంతో నాన్న చనిపోతే అమ్మ ఒంటరి. భార్యలేని పెద్దరాములు సార్ కూడా ఒంటరే! అధికంగా మౌనంగా ఉంటుంది. అటుపెద్దరాములు సార్‌కు స్కూలు తప్ప మరో లోకం లేదు. ఆ ఇద్దరినీ కలపాలని ఈ చిన్నివిద్యార్థి కలలు కంటుంది. కలేంటి.. తీవ్రంగానే ఆలోచిస్తుంది. ఇద్దరినీ కలిపి కథ సుఖాంతం చేస్తుందీ రచయిత్రి అనుకుంటారు పాఠకులు. కథ సుఖాంతం అయితే రచయిత్రి గొప్పతనమేముంటుంది? పెద్దరాములు సార్‌ను చంపేసి, కథను అనుకోని మలుపు త్రిప్పి కథ ముగిస్తుంది రచయిత్రి! అమెరికన్ ఊహించని మలుపుతో ముగించి సంభ్రమాశ్చర్యాలతో ముంచుతుంది మొదటి కథ 'పెద్ద రాములు సారు'లో. కథ ఆసాంతమూ ఒక విద్యార్థిని బాల్యదశలోని అమాయకతతో నడిచి హెచ్.ఎం. సులోచన, ఎస్.ఎఫ్.ఐ లీడర్లు నజీరన్న ప్రభాకరన్నలు ప్రసక్తి వచ్చినా, రాములుసార్ పాత్రనే 'ఇల్యూమినేట్' చేస్తూ, కత ముగుస్తుంది.

ఉదాహరణగా మరో కథ-కం-స్కెచ్. మహా కవి గుంటూరు శేషేంద్ర శర్మగారు 'ఋతు ఘోష' అనే కావ్యంలో ఆరు ఋతువులను మనుషులను అనుసంధానం చేస్తూ మనుషుల జీవితాలపై ఋతువుల ప్రభావాన్ని వివరించారు.'ఋతువు' అనే పదాన్ని 'పన్' (Pun) గా తీసుకుని ఆడవారు 'నెలసరి' సమయంలో ఎదుర్కునే శారీరక, సామాజిక సమస్యల్ని "రుతు గోస"గా వివరించారు. కౌమారంలో తొలి అడుగు మోపిన ఒక చిన్ని బాలిక రజస్వల మధ్య వయస్కురాలి అసౌకర్యం వరకు వివరించి పరిష్కారం ఏమిటో సూచించారు. ఆడువారు మాత్రమే వ్రాయగలిగే కద-కం-స్కెచ్ ఇది. చెప్పుకోవటానికి కూడా 'బిడియపడే' రుతుగోస (Bold) గా కఢీకరించిన రచయిత్రికి 'హాట్సాఫ్' చెప్పాలనిపిస్తుంది.

మరణానంతర జీవితాన్ని చెబుతుంది 'ఆనంద లోకం' కథ. వైకుంఠంలో మూడు కోట్ల దేవతలు. రంభ ఊర్వశి, మేనకలు, సురాపానం కంటే-భిన్నమైన మరోలోకం ఆనందలోకంలో తమ పూర్వీకులు, 'మాయాబజార్'లోని చిన్ని సావిత్రి, నాగ్‌తాత (స్వర్గీయ అక్కినేని నాగేశ్వరరావు) నూర్యకాంతంను, ఇందిరాగాంధీ, మిరపకాయ బజ్జీల రెసిపి- ఇలా రచయిత్రి ఆలోచనలు అశ్వమేధ హయాలై అప్రతిహతంగా పరిగెడతాయి.

కథలకిచ్చిన టైటిల్స్- 'నాకు ప్రేమించటం రాలేదా? ఏమో!' 'చూపైనా దక్కుతుందా? ఏమో!' అనవసరంగా ప్రేమించి చచ్చానా?'లో కూడా నవ్యత, నాణ్యత చూపెట్టారు రచయిత్రి.

అందుకే- వీటిని కథలనాలా? మరేదో అనాలా? ఏమో- అందించిన ఈ 'కథల్ని' చదివి ఆనందించటం ఆనందలోకాల్లో తేలిపోవటం మనవంతు.

మందుటెండలో ధంప్పస్'లా 'కోక్'లాగా ఇన్‌స్టెంట్ (Instant) చల్లదనపు 'కిక్కు'ను ఇస్తాయి. నిమ్మకాయ షర్బత్‌లాగా వంటికీ మనసుకీ చల్లదనాన్ని నెమ్మదిగా ఇస్తాయి కథలు. కథ ఇలానే ఉండాలి అన్నసరిహద్దులు, లక్ష్మణ రేఖల్ని అధిగమించి అలరిస్తాయి కథలు!

ప్రతులకు: రచయిత్రి
సెల్: 9247478080

- కూర చిదంబరం
సెల్: 8639338675

ఒంటరితనం

పురిటిలోనే ఒంటరిని
అమ్మకైతి యమపాశం
జీవంతీసి జీవంపోసుకొని
కన్నీళ్ళకైతి వశం!!

తండ్రి తలకడనే
అడుగుకు కైయ్యిన్నుంతరకు
బాల్యం ఎదిగినే
మెట్టుగా ఎగుదుదిగుదులకు!!

నాకెవ్వరు లేరుగా
స్నేహానికి పోటి
నన్నందరూ చూసిరిగా
ఏళనగా వెక్కిలితోటి!!

చదువు ఎంతిష్టమంటే
ఉన్నదున్నట్టు చెప్పెంత
పేదరికం నాతోటుంటే
అక్షరమయ్యే నుయ్యంత!!

చదివా కష్టమైన
కసురత్తులతో డిగ్రీ
వచ్చుననుకున్న ఉద్యోగమైన
దేహంలొచ్చె డిగ్రీ!!

బంధమున్నా ఒంటరిని
కపటంతో దున్నునైతి
అవసరాన్నికీ నేనోరుచి
బంధాన్నికెక్కడ నీతి!!

బ్రతకటాన్నికి జీవనోపాధి
కాళ్ళరగిన లేదు
పడతయ్య కనులబంధి
ఏడాదైన దయలేదు!!

ప్రేమనే చిగురుతో
చిరునవ్వులతో చేస్తీచెలిగా
వదలని పొగరుతో
మరలవుతి ఒంటరిగా!!

ముళ్ళేస్తీ చక్కిళ్లచుక్కకు
మనసు చంపుకొని
నారాతనే నాపాపకు
రాసేను ఆదేవముని!!

తనున్నప్పుడు ఒంటరిగా
చేస్తిని పుస్తెలబంధాని
తనదూరం భాధగా
నేననుకుంటి నేనొంటరని!!

నాబిడ్డను ఆడిస్తీని
నాగుండెలపై ఊతగా
ననుతన్నే భారమని
నాపాపాయి ముసలోడిగా!!

నేనేరోజు ఏడువలే
కష్టంలోన బాధలోన
ఏబంధం శాశ్వతమనుకోలే
ఊపిరి ఆగేదాకైన!!

-మల్లె రంజిత్ కుమార్
7032650908

బాల కార్మిక గేయం

ఓ చిన్న బాలల్లారా
బడి ఈడుపాపల్లారా
పశువులు మీరూ కాయొద్దు
కన్నీళ్ల పాలు కావొద్దు
ఆరోగ్యం కాపాడుకోండి
అన్నిట్లో ముందు నడవండి.

ఓ కుర్ర కూనల్లారా
సైకిల్ రిపేరు చెయ్యకండి
హోటల్లో ప్లేట్లు కడగకండి
తోటివారితో కలిసి చదువుకొని
జీవితము సుఖముగ గడపండి

బడికి చక్కగా వెళ్ళండి
చదువులు బాగా చదవండి
డాక్టరు,పోలీసుల అవ్వండి
ప్రజలకు సేవలు చేయండి

-తీగల చైత్ర
6వ, తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుర్రాలగొంది
మండలం నారాయణపేట
జిల్లా సిద్దిపేట.9704865816

లొట్టపిట్టలు

(కథ)

ఓ 'ప్రభాతం' వేళ మొట్ట పిట్టలు రెండు ఆహారమునకై అన్వేషణ ప్రారంభించాయి. అది వేసవి కాలం పదకొండు గంటలకల్లా ఎండలు భగ్గుమంటున్నాయి .ఎంత వెతికినా ఆహారం దొరకడం లేదు సరికదా నోరు ఎండిపోతుంది .ఆడలొట్టపిట్ట తన భర్త తో నోరు పిడచ కట్టుకు పోతుంది నీటి జాడలేదు . పైగా ఈ అంతస్థులు ఏమోఆకాశాన్ని తాకేలా కట్టాడు మానవుడు కొన్ని నీ ళ్ళు

బయట కనబడవాయే , సాలోచనగా లొట్టపిట్ట మనిషి హృదయం ×పాషాణం× అనడానికి ఈ భవంతులు తార్కాణం తన క్షేమమే ×ప్రామాణికం× గా సాగే మానవుని ఆలోచనలతో చెట్లను నరికి వేస్తూ వర్షం నీటిని లేకుండా చేస్తూ మనలాంటి చిన్నిప్రాణాలను ఇబ్బంది పెడుతున్నాడు. ఈ మానవుని అకృత్యాలను ×ప్రక్షాళన× చేసే మహానుభావులు ఉద్భవిస్తే తప్ప మనకు ఈ కష్టాలు తప్పవు అంటూ నిట్టూర్చాడు. ఇవన్నీ విని ఓపిక లేని పిట్ట మీ పురాణాలు మీవే నా పరిస్థితి ఏంటో ఎప్పుడూ అర్థం చేసుకున్నారు గనక అంది .మూతి మూడు వంకర్లు తిప్పుతూ డాబా పైన కూర్చుంది.కూచోవడానికి చెట్టైన కనపడక,వెనుకనే వెళ్ళిన భర్త పిట్టను దుర్భాషలాడుతూ... హేళన చేసి అతనిలో ×పౌరుషాగ్ని× ని రగిల్చింది.

కోపంతో లొట్ట పిట్ట తుర్రుమంది నీరసంగా ఉన్నా పిట్ట మరీ ఎగరలేక తన భర్త తన కోసం ఏదైనా తీసుకొస్తాడు అన్న ఆశతో అక్కడే కూర్చుంది.

ఎగురుతున్న లొట్టపిట్టకు కోపం తగ్గి,ఆలోచన మొదలైంది.గొంతు తడారి తనకేమైన అయితే ...ఆ ఊహ కే ఒళ్ళు జలదరించింది.వేరొక బిల్డింగ్ ట్యాంక్ దగ్గర వాలింది.బిరడా గట్టిగా బిగించి ఉండటం చూసి ప్రాణం ఉసూరుమంది. చుట్టూ పరికించి చూసింది మూలనున్న పైపు లీక్ అయి నీరు కారుతూండటం గమనించింది .ప్రాణం లేచి వచ్చినట్టయింది తను తాగి, తన భార్య గుర్తుకు వచ్చి పక్కనే ఉన్న కొబ్బరిచిప్పలో నీరు పట్టుకొని తీసుకెళ్ళింది .తన భర్త రావటం చూసి లోలోన సంతోషించింది. తెచ్చి తాగమని బ్రతిమిలాడాడు తాగాలని ఉన్నా కాస్త బెట్టు చేసింది.ఇంకాస్త బతిమాలించుకొని నీరు తాగింది.కాస్త కుదుట పడ్డాక నీవే నాకు ప్రాణం ,నేనే నీకు లోకం అంటూ పాడుతూ ఆహారన్వేషణలో పడ్డాయి.

-సి.హేమలత
9666779103

రంగుల హరివిల్లు

వడలిపోతున్న వార్ధక్యంలా
జీవితపు మొఖంపై పూసిన
యవ్వనపు రంగు వెలిసిపోతుంది.
నిద్రలేని తెల్లని కనుపాప
స్వచ్ఛత మాసిపోతుంది.
మూగబోయిన ఊసులు
మాగన్నులా ముడుచుకుంటే
వేకువ చూసే కోర్కెలు
నల్లని చీకటి రంగును మూసి
తెలవారుతున్నాయి.
మేఘం దేహం
చెమట బిందువుల
శ్వేత చినుకు జారి
పూరేకు పొదలలో పడి
హరిత వర్ణమైనది
వెలసిన గోడలా అక్కడక్కడా
దిగులు ఊదా రంగు.
తొలిపొద్దు పచ్చని బొట్టు
గోధూళి నీరెండని కలగలిసి
సింధూర వర్ణంగా
అమరింది.
ఏ రంగు అయినా బంధించిన
ఎర్రని పెదవులు తెరుచుకున్న వెంటనే
రంగు వెలిసిపోయి
తెల్లని పలువరుస
పక్కన చేర

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 503వ రోజు 'జ్ఞాపిక ' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'జ్ఞాపిక ' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా... -సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిర్గి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం ఏకాంశ కవిత్వం నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

తీపి గురుతులు

జ్ఞాపికలు తీపి గురుతులు
గురుతు చేసుకున్నప్పుడల్లా
ఆనందాన్ని పంచే అమృత గుళికలు.
కోటి ఆశలతో
వైవాహిక జీవితం లో అడుగుపెట్టిన
నవ వధువు కు
తొలిముద్దే మధుర జ్ఞాపిక.
అహర్నిశలు కష్టపడే విద్యార్థులకు
అందుకున్న పట్టా
సంతృప్తికరమైన జ్ఞాపిక.
ఉద్యోగి ప్రతిభకు
ఉడుతా భక్తిగా అందించే సన్మానం
అభినందనపూర్వక జ్ఞాపిక.
నేటి నిజంలో
కవిత ప్రచురణ
దర్పణం సాహిత్య వేదిక అందించే
ప్రోత్సాహ పూర్వక జ్ఞాపిక.
ప్రతి మంచిపని అవ్వాలి ఓ జ్ఞాపిక
జీవిత మంతా
ఆనందమే ఇక.

- కపిలవాయి అశోక్ బాబు

మధురానుభూతి

గడచిన కాలంలో
అలు పెరగక చేసిన
అవిరళ కృషికి గుర్తింపు-జ్ఞాపిక !.
నిరంతర సాధనతో
సడలని పట్టుదలతో
సాధించిన విజయానికి సత్కారం జ్ఞాపిక !.
ఆకలి దప్పుల మరచి
వ్యయ ప్రయాసల కోర్చి
చాటిన ప్రతిభకు కట్టిన పట్టం జ్ఞాపిక !.
గుమి కూడిన పలువురి ఎదుట
పలు పలు విధములుగా ప్రశంసించి
అందించే అపురూప కానుక జ్ఞాపిక !.
కళాకారుడైనాక్రీడాకారుడైనా
కరతాళ ధ్వనుల నడుమ
మధురానుభూతిగా పొందేది
జ్ఞాపిక !.

-రామకృష్ణ చంద్రమౌళి

తీపిగుర్తులు

సృజనకిచ్చే జ్ఞాపిక
చిన్నదో పెద్దదో
ప్రతిభకి తీపిగుర్తు
లోహ ఆకృతులు
దారు చిత్రాల సమర్పణ
సంస్థ గుర్తులూ
అధిపతి చిత్రం
అందుకున్న వారిపేరు చిత్రం తో
జ్ఞాపికలు
ఇప్పుడు నిత్య సంబరాలు!.
సన్మానం పొందలేని నిస్సహాయత
ఒక్క జ్ఞాపిక అందుకోలేని
ఆశ్చర్య పరిస్థితులు
వచ్చిన వాళ్ళకే
నియమం సంతకెళ్ళా...? !
అయినా ఒకటే హర్షం !
ప్రతిభ ఉంది అన్న నమ్మకం
కలిగించిన పద్ధతి!!.

-ఎం. వి. ఉమాదేవి

మధుర జ్ఞాపిక

జ్ఞాపిక-
మధురమైన జ్ఞాపకానికో గుర్తు
కలకాలం మనస్సులో జ్ఞాపకం
జ్ఞాపిక స్వల్పకాలికమా దీర్ఘకాలికమా
పుష్ప గుచ్ఛం ఒక మధుర జ్ఞాపిక.
పుష్పాల తాజాదనం ఆయువు గంటలే
నిన్నటి పుష్పగుచ్ఛం నేడు నిరర్థకం
జ్ఞాపకాలు మాత్రం సుస్థిరం
జీవితపర్యంతం
జ్ఞాపిక బహూకరణ ప్రదానం
జ్ఞాపిక విలువెంతనేది అప్రస్తుతం
ఎంత ప్రేమతో ఇచ్చారనేదే ముఖ్యం
కర్రతో చేసిన జ్ఞాపిక
చెదపురుగుతో మాయం
గాజుతో చేసిన జ్ఞాపిక పగిలిపోతే
అంతేసంగతులు
లోహంతో చేయబడిన జ్ఞాపిక
ఎంతకాలముంటుంది?!
లోహం విలువెంతో తెలీదు
విషాద ఘట్టాల్ని జ్ఞాపకం చేసే జ్ఞాపిక
చేదు నిజాల్ని మదిలో పదిలం చేసే జ్ఞాపిక
చెరిపి వేయాలన్నా
చెరగని ముద్రిత ముద్రికలు
జ్ఞాపిక జ్ఞాపకమో అజ్ఞాపకమో
మరుగున పడిపోయే జీవనస్తరమో
సమయం సందర్భం హృదయం
కలబోసిన కమనీయ
ఘట్టం జ్ఞాపిక!.

- లక్ష్మా రెడ్డి పసుల

తీపి గుర్తు

తీపి గుర్తుల చిహ్నమే జ్ఞాపిక
ఆటల పోటీలలోనూ
సాంస్కృతిక పోటీలలోనూ
రకరకాల పోటీలలోనూ
పాలుపంచుకొని గెలుపొంది
అందుకునే బహుమతి
చిరు స్మరణీయ జ్ఞాపికే.
చూసినంతనే ఆనాటి
అనుభూతి పునస్మరణం
పాల్గొన్నందుకు సైతం కొందరు
అందరికీ అందిస్తారు జ్ఞాపిక
ఆహూతులకూ అందిస్తారు
రకరకాల జ్ఞాపికలు
శుభాశుభ కార్యక్రమాల్లో
పాల్గొన్నా జ్ఞాపికలు.
జ్ఞాపిక చిరకాల జ్ఞాపకాలను
చేస్తోంది మనస్సులో నిక్షిప్తం
నిర్వాహకులకు జ్ఞాపికలు
చిరుకాల గుర్తింపు
ఇండ్లలో ప్రదర్శన
జ్ఞాపికలు దర్పాలకు నిదర్శనంగా
ప్రత్యేక ఏర్పాట్లు సైతం
స్థోమతలను బట్టి
రామాయణంలో రాముడు
హన్మంతునితో సీతకు పంపిన
అంగుళీయకం జ్ఞాపికే కదా.
జ్ఞాపిక
ఆయా సందర్భాలను
నిరంతరం జ్ఞాపకం చేస్తుంది.

- గుండం మోహన్ రెడ్డి

ప్రేమ పిపాసుల జ్ఞాపిక

గడిచిన కాలమందుగల కమ్మని గుర్తుల పూల తోటలో
పొడిమడిసాగులో శ్రమలు పోరుఫలమ్ములభద్రమూర్తియై
తడుపు రసానుభూతులను ధైర్యము, మద్దతు, కూడగట్టుచున్
విడివడు తృప్తి రూపమది ప్రేమ పిపాసుల జ్ఞాపికయ్యెడిన్!!.
మాబాల్యమ్మునపడ్డ కష్టముల మార్గమ్ము సన్మానమున్
ధీబల్మిన్ మదినిండగా నెమరుతో తేజమ్మునుత్సాహమై
ప్రాబల్యమ్మున గుండెతాకి కదలన్ భాగ్యమ్ము సౌధమ్మునై
శోభన్ వెల్గుల యాది చేతనమునై సొంపారు లోకమ్ములో!.

- మాదుగుల నారాయణమూర్తి

జ్ఞాపిక

పలు సందర్భాలకు పలు జ్ఞాపికలు
గృహ ప్రవేశాలు
పుట్టినరోజులు వివాహాలకు
ఆహూతులకు చిరు కానుకలు
ఆతిథ్యమిచ్చే వారికి కానుకలు
ఏవైనా జ్ఞాపికలు
స్థోమతలకు నిదర్శనాలు.
సాహిత్య సాంస్కృతిక సందర్భాలలో
కళాకారులకే గాక అతిథులకూ జ్ఞాపికలు
ఇంటిపెద్దనో ఇష్టమైనవారో మరణించినపుడు
స్మారకంగా జ్ఞాపికలు.
బహుమతులూ జ్ఞాపికలే
విద్యాభ్యాస కాలం
ఆటల్లోనూ సాంస్కృతిక పోటీల్లోనూ
విజేతలకిచ్చే బహుమతులూ జ్ఞాపికలే
గెలుపొందిన వారికిచ్చే జ్ఞాపికలు
ఇచ్చేవారికీ పుచ్చుకునేవారికీ
అపురూపం ఆనందం.
వ్యక్తిగతమూ వృత్తిగతమే కాదు
బృందాలకూ చక్కని ప్రోత్సాహం
జ్ఞాపికలు
మనుషులను సందర్భాలను
గుర్తుకు తెచ్చి ఆనందపరచడమే కాదు
ప్రసిద్ధులనూ పరిచయం చేస్తాయి
అందమైన నూతన ప్రదేశాలనూ
చూపిస్తాయి

-నాగిరెడ్డి అరుణ జ్యోతి

తీపి గుర్తులు

సాధించిన విజయం
ఉద్దీపన చేసే జ్ఞాపిక
విజయగర్వంతో అందుకుంటాం
అనుభూతి అనితర సాధ్యం
ఉప్పొంగే ఉత్సాహం
సంతోషంతో గంతులు.
అందుకున్నపుడే కాదు
దాన్ని చూసినప్పుడూ
ఎంతో సంతోషం గర్వం
ఆ మధుర క్షణాలు మరిచి పోలేనివి
జ్ఞాపిక
షో కేసులో అలంకరణ
జ్ఞాపకాలు మదిలో పదిలం
జీవితంలో మరిచిపోలేని
కొన్ని జ్ఞాపకాలు అందరికీ
కొన్ని మరిచి బ్రతకలేం
మరికొన్ని మరవకపోతే బ్రతకలేం
జీవితం పెరిగే కొద్దీ
పెరిగే జ్ఞాపకాలు.
మనంకొల్పోయిందీ
మనం గెల్చుకుందీ
మనజ్ఞాపకమే..
మనతోనే ఉంటాయి
మనతోనే పోతాయి.
జ్ఞాపిక వేస్తుంది
మరోజ్ఞాపికకి పునాది
అదే విజయానికి నాంది
జ్ఞాపికతో కర తాళ ధ్వనులు
విజేత గుండెల్లో సరిగమలు.

- మోటూరి శాంతకుమారి

జ్ఞాన నిధి

ఆ అక్షరాలు పూసిన అభినందనలు
ఘనమగు మణిరూప శిల్పవైభవాలు
సన్మానానికి తోడుగా సంతోషం
సమున్నత విలువలకు ప్రస్థానం.
చూపరులకు ఆశ్చర్యం
జ్ఞాన నిధులకు ముంజేతి కంకణం
జ్ఞాపిక ఓ తీపి వేదుక
పంచేనొక మహోన్నత వేదిక
తోటి ప్రియులకు ప్రేరణలు
సాటి వారలకు వెలుగు దివ్వెలు.
జ్ఞాపిక ఓ కలికి తురాయి
రోజూ రోజాలా వాడని ప్రతిభోయి
వ్యాఖ్యానాల పద పల్లవాల మల్లిక
విషయ విశ్లేషణల పదనిసల అల్లిక
కొంటే దొరికేదైతే కంటికి శాంతి గంధం
అడిగిన వారి ప్రశ్నలే ముల్లు చందం
నవ్వులో ఏడ్వాలో చూస్తూంటే చిత్రమే
ప్రతిభకే పట్టాభిషేకమైతేనే ప్రీతి.
కొన్ని పాదముద్రలు అటుగా వేస్తూ
ఆశల సాధికారత దిశగా



- ఏడెల్లి రాములు

ప్రతిభ

పోటీ తత్వంతో విద్య
విభిన్న రంగాల ప్రతిభకి
విలువైన జ్ఞాపికలు
కేవలం వ్యక్తి ప్రతిభకే.
ఎన్నో రంగాల్లో
అన్నిట్లో పోటీ
విజయ లక్ష్మి వరించిన వారికి
ఆ సంస్థ నుంచి గుర్తింపు గా
జ్ఞాపిక
అది కొందరికే సొంతం .
వందలాదిగా పాల్గొంటే
వచ్చేది అదృష్ట వంతులకే
జ్ఞాపిక-
విశేష ప్రజ్ఞకు గుర్తింపు.

- నారుమంచి వాణి ప్రభాకరి

అమరజీవి అంబేద్కర్

మహర్ కులంలో
వెలిసిన వేగుచుక్క...
గంజాయి వనంలో
మొలిచిన తులసిమొక్క...
దళితుల పాలిటిదైవం...
దారిచూపే దీపం...
అణగారిన పేదప్రజల ఆశాకిరణం...
ఓ అమరజీవి అంబేద్కర్ !
దండాలయ్య మీకు దండాలు!
మీకు జన్మనిచ్చిన " ఆ
రాంజీ భీమాబాయిలకు" కోటిదండాలు !

వీధిబడికెళ్తుంటే
మిము వింతగా చూస్తుంటే
విదేశాలకేగి ఉన్నత విద్యనార్జించి
బుక్కులెన్నో పఠించి హక్కులన్నీ గ్రహించి
గాఢనిద్రలో ఉన్న గబ్బిలాలకు
"జ్ఞానబోధ" చేసిన
బావిలోని కప్పలకు
"బ్రతుకుదారి" చూపిన
కావు కావుమని అరిచే కాకులకు
"కోకిలరాగాలు" నేర్పిన
పూరిగుడిసెలో పుట్టిన బహుజనులను
"పులులుగా" మార్చిన
ఓ అమరజీవి అంబేద్కర్ !
దండాలయ్య మీకు దండాలు!
మీ "ఆదర్శ భావాలకు" వేయి దండాలు !
అణగారినవర్గాల అభ్యున్నతికి
జీవితాన్ని అంకితం చేసి
ఊరూరా తిరిగి ఉద్యమాలు రేపి
ఉపన్యాసాలతో ప్రజలను ఉర్రూతలూగించి
మనిషి మనిషి మధ్య మంటలు రేపే
మనుశాస్త్రాన్ని మట్టుపెట్టి అడుగునున్న
బడుగువర్గాల అభివృద్ధికి గొడుగు బట్టి
పిచ్చిమతాచార్యులు నెత్తిన పిడుగులా పడి
అస్పృశ్యతను అంటరానితనాన్ని
నిరసించిన నిప్పులు కురిపించిన
ఓ అమరజీవి అంబేద్కర్ !
దండాలయ్యా మీకు దండాలు !
మీ"కండబలానికి
గుండెబలానికి" కోటి దండాలు !

కరెంట్ షాక్ కన్నా కాలకూటవిషం కన్నా
అతిభయంకరమైన అంటరానితనానికి
ఆహుతైపోకుండా అగ్రవర్ణాల
వారి అడుగులకు మడుగులొత్తే
బానిస బ్రతుక్కి బలైపోకుండా
రాజ్యాంగ రక్షణలెన్నో కల్పించి
కులంపేర ఈ సంఘం కుళ్ళు పోకముందే
కులమనే విశ్వవృక్షాన్ని కూకటివేళ్లతో సహా
పెకలించి వేయాలని ప్రబోధించిన...
సాంఘిక దురాచారాలను "సమాధి"
చేసిన...
సమసమాజానికి "పునాది" వేసిన...
ఓ అమరజీవి అంబేద్కర్ !
దండాలయ్యా మీకు దండాలు!
మీ "సాంఘిక సంస్కరణలకు"
శతకోటి దండాలు !

ఓ మహాత్మా !
మీరే మాకు దైవం !
మీ మాటే మాకు వేదం !
మీ బాటే మాకు శరణం !
మీ స్మరణే ఓ ప్రేరణ !
మీ అడుగుల్లో అడుగులు వేస్తాం !
మీ ఆశయాలకు
మా జీవితాలను అంకితం చేస్తాం!
ఓ అమరజీవి అంబేద్కర్
మీకిదే మా అక్షరనీరాజనం
(అంబేద్కర్ జయంతి
సందర్భంగా అక్షరాంజలి)

-పోలయ్య కూకట్లపల్లి
9110784502

అఖండ తేజం



మానవత్వం అడుగంటిన
ఆధిపత్య ధోరణులు
కనికరమసలులేక అణిచివేసిన
ఆటవిక రీతులు..

జాతినెంచి దూరం పెట్టిన
నీతి బాహ్యమైన చేష్టలు....

కటిక పేదరికం ఇంటి చూరై
కంట నీరు పొంగించిన
వివక్షా పోకడలు....

ఐనా గురి తప్పని
లక్ష్యం...
ఒత్తిడి ని చిత్తుచేసే
బృహత్తర సంకల్పం...

కులాల కుటిలత్వపు జాడ్యాన్ని
అచంచలమైన దీక్షతో
ఎండగట్టిన చేతనా శిఖరం...

ప్రజా స్వామ్య భారత వృక్షానికి
రాజ్యాంగపు పట్టు కొమ్మను చేర్చి
జన జీవన గమనానికి
సమత్వపు గీతాన్ని
అందించిన అపూర్వ
కాంతి కలశం...

అంబేవాడలో మొలకెత్తి
భారతీయ సమాజానికి
వెలుగులద్దిన అఖండ తేజం...

అంబేద్కర్ ఒక ప్రభంజనం..
మాటలకు అందని
మహోన్నత గుణ సాగరం...

-వెల్ముల జయపాల్ రెడ్డి
9441168976

నిత్య చైతన్యశీలి

తను దహిస్తున్న
అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు
నింపిన దివిటి
మండే సూర్యుడై నిప్పుకనికై
వెలిసిన భానుడు
భూమిలో పడ్డ విత్తనం
మొలికెత్తినట్లుగా
నమ్మిన నిజాన్ని
ఎన్ని గాయాలు అయిన
మనువాదాన్ని మంట గలిపి
బౌద్ధం ఆచరించిన వాస్తవిక వాదీ
అణగారిన వర్గాలు హక్కులు
పొందేందుకు
ప్రపంచ రాజ్యాంగాల్లో
మేటి రాజ్యాంగ శిల్పి
భారత్ యావత్తుకు
రాజ్యాంగమే ఆధారం
కట్టే ఫలి అని నమ్మి
అర్ధ ఆకలి తో
ఎన్నో డిగ్రీలు దాసోహం అయ్యాయి
ప్రపంచ.మేధావి అతను
లేరు ఎవరు అతనికి సాటి
చెట్టు పేరు చెప్పి కాయలు
అమ్ముకున్నట్లు
రాజకీయ పార్టీలు రచ్చమని
అతని ఆలోచనల సంపుటి
రాజ్యాంగంలో ని ఆశయాలకు
రూప0 ఇవ్వండి
కదం కదం కలిపి
మానవతకు చేయూత నిచ్చి
కులం లేని సమాజం వైపు
అడుగులు వేద్దాం
ఫొటోలకు పోజులిచ్చే జన్మదినలు కాదు
ఆయన ఆశయాల అమలుకు
వాస్తవికంగా సాగుదాం
జై బీం జై జై భీం

-వి.శేషారావు
9440408080

మనకోసం మనం ఎంతో ఖర్చు పెట్టుకుంటాం. కానీ.. పరులకోసం పట్టుమని పది పైసలైనా విదిలించం.

సభలో ప్రసంగిస్తున్న డా॥ అమృతలత. వేదికపై చిట్టిమిల్ల హరిప్రసాద్ , డిజిపి వినీత్, డా॥ పవన్ కేడియా ధనపాల్ సూర్య నారాయణ

ఈ లోకంలోంచి వెళ్లేప్పుడు మనతో పాటు కనీసం పూచిక పుల్లైనా మనలో ఎవరం తీసుకెళ్ళమన్నది మనందరికీ తెలిసిన విషయమే !

అయినా ఎంత సంపాదించినా మన పిల్లలకోసం ఇంకా ఇంకా .. ఏదో సంపాదించాలన్న 'యావ' లోనే వుంటాం!

మనకి వుండడానికో ఇల్లు సరిపోదనుకుంటాం! మనవలూ, ముని మనవల కోసం ఒకటికి పది ఇళ్ళు కట్టుకోవాలని చూస్తాం ! పదులూ, వందల సంఖ్యలో ఎకరాలను కొనుగోలు చేయాలనుకుంటాం !

నాకో కారూ, నా భార్యకో కారూ, కోడలికో కారూ , మనవడికో కారూ, మునిమనవడు స్కూల్ కి వెళ్లడానికో కారూ వుండాలని... ఇంటి నిండా కార్లతో మన దర్పాన్ని ప్రదర్శించాలని చూస్తాం! మనం బ్రతికి వున్నన్ని రోజులూ .. చూపరులందరికీ .. చిరునవ్వులు చిందిస్తూ.. దివ్యంగా వెలిగిపోయే మన ఫోటోలు... మన మనవల రాజ్యం వచ్చేసరికి .. పాపం గోడ మీద నుండి దిగిపోయి , వాటి స్థానంలో మన కొడుకుల ఫోటోలు ఆక్రమిస్తాయి! మన ఫోటోలేమో మన ఇంట్లోనే చీమలు కూడా దూరని ఏ చీకటి రూమ్ లోనో ఒక కర్ర పెట్టెలో దూరి , ఊపిరాడకుండా విలవిల్లాడుతూ వుంటాయి.

ఇక ముని మనవల రాజ్యం వచ్చేసరికి .. మనింట్లో వున్న ఆ కర్ర పెట్టె కూడా వాళ్లకు బరువై , వీధి అవతల వున్న పెంట కుప్పలో దర్శనిమిస్తుంది.

డెబ్బై ఏళ్ళు వచ్చినా .. మనకి అర్థం కాని ఈ నగ్న సత్యం పాతికేళ్ల ఈ సాయిబాబుకీ, అతడి మిత్ర బృందానికీ అర్థమైనట్టుంది..అనాథలనీ , దిక్కూ దివాణం లేని మనుషుల్ని ఆదుకోవాలన్న తపనతో .. కరోనా కాలం నుండి వాళ్ళు కృషి చేస్తూనే వున్నారు.కరోనా తీవ్రంగా వున్న కాలంలో కరోనా సోకినవాళ్ళదగ్గరికీ ,వీధుల్లో అన్నం లేక అలమటిస్తోన్న వాళ్ల దగ్గరికీవెళ్ళటానికే జనం భయపడుతోన్న కాలంలో ..ఆ అబ్బాయి వాళ్ళ దగ్గరుండి వాళ్లకి తన చేత్తో తినిపించడం ,షేవ్ చేయడం లాంటివి చూసి -అతడికి ఎక్కడ కరోనా సోకుతుందేమో అని భయపడ్డాం!

కానీ అతడి దృఢ చిత్తం చూసి - కరోనానే పలాయనం చిత్తగించింది!

ఈ రోజు తన మిత్రులందరితో కలిసి అభాగ్యులందరికీ ఓ 'ఆశ్రమం' కూడా కల్పిస్తున్నారు.ఏ ముని శాపవశాత్తో .. ఏ లోకాల నుండో వస్తూ పోతూ, ఈ కోవెలలో ... తాత్కాలికంగా నివసిస్తోన్న 'దేవుళ్ళే' ఈ అనాథలు !

ఈ దేవుళ్ళని అచంచల భక్తితో , ప్రేమాప్యాయతలతో కొలుస్తోన్న 'పూజారులే ' .. ఇదిగో మీ ముందు నిల్చున్న ఈ సాయిబాబు, అతడి మిత్ర బృందం !

మనలాంటి వాళ్ళం'భక్తుల' రూపంలో రోజుకో రూపాయి చొప్పున నెలకి ఓ ముప్పై రూపాయిలైనా వీరి హుండీలో వేస్తే .. ఈ ఆశ్రమం నిరాటంకంగా కొనసాగుతుందని ఆశిస్తూ , కొనసాగాలని ఆకాంక్షిస్తూ .. ఈ పూజారులను అభినందిస్తూ ..

- డా. అమృత లత

పౌరాణిక కళాకారులను ఆదుకోవాలి

పౌరాణిక నాటక కళాకారులు నేడు వృత్తి కోల్పోయారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు అన్నారు. త్యాగరాయ గానసభ కళా దీక్షితులు కళా వేదికలో శనివారం రాత్రి శూలపాణి బృందంతో సత్య హరిప్పంద్రీయం పౌరాణిక పద్యనాటక ప్రదర్శన రంజకంగా సాగింది. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ఆయన నటీనటులను సన్మానించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి సభకు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో గోపాల్ కేఎస్ మూర్తి పాల్గొన్నారు.

ఉగాది సాహితీ పురస్కారాల ప్రదానం

జ్యోత్స్నా కళాపీఠం ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభ కళా సుబ్బారావు కళావేదికలో శనివారం వివిధ రంగాల ప్రముఖులకు శ్రీ శుభకృత నామ సంవత్సర ఉగాది సాహితీ పురస్కారాల ప్రదానం కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలుగు వర్సిటీ పూర్వ వీసీ డా॥ ఆవుల మంజులత మాట్లాడుతూ పురస్కారాలు ప్రోత్సాహాన్నిస్తాయన్నారు. కార్యక్రమంలో ఆచార్య గౌరీశంకర్, ఆచార్య ఎన్. శరత్‌జ్యోత్స్నారాణి కళా జనార్ధనమూర్తి, ఆచార్య కుసుమాబాయి, పోతుకూచి భట్టీశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు. పురస్కారాలను డా॥ చిక్కా దేవదాసు, ప్రొద్దుటూరి ఎల్గారెడ్డి, హరీష్‌కుమార్, విజయలక్ష్మి, ఆచార్య భీమయ్య. పొత్తూరి సుబ్బారావు, జీవీ అమరేశ్వర్‌లకు ప్రదానం చేశారు.

బాబ సాహెబ్ అంబెడ్కర్ జయంతి

బడికి బయట నిలిచి
గుడిచివరన వుండి
వీది కంబమందు విద్యనెర్చి
పుస్తకాలు చదివి మస్తకంలో దాచి
ప్రజల మనిషిగాను ప్రబలినాడు

దేశరక్షనెంచి దేశదేశము కేగి
ధర్మసూత్రములను దండిగాను
రచనగాను మలచి రాజ్యంగమును రాసి
దేశకీర్తి పెంచె దీరుడుగను
బడుగు జాతి జనుల బాగు కొరకు నిల్చి
బాధలన్ని బాపె బాటసారి
బడుగువర్గనేత బాబసాహేబుడు
జనుల హృదిన నిల్చె జాతిపితగ

-ఉంద్రాళ్ళ రాజేశం
9966946084

భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ సాహిత్య అకాడమి, హైదరాబాద్ పాతనగర కవుల వేదిక ఆధ్వర్యంలో శ్రీ పీవి.నరసింహారావు గారి శతజయంతి కవితాంజలి "కాలాతీతుడు" ఆవిష్కరణ మరియు శ్రీ శుభకృత్ ఉగాది సందర్భంగా శైలజామిత్ర అందుకుంటున్న కవితాభినందన సత్కారం. ఈ సభలో పివి నరసింహారావుగారి కుమార్తె, ఎమ్మెల్సీ, శ్రీమతి సురభి వాణీదేవి పాతనగర కవుల వేదిక అధ్యక్షులు కె.హరినాథ్,కొరుప్రోలు, ప్రముఖ కవి ఏనుగు నరసింహారెడ్డి తదితరులు.

కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
'బుధవారం బాద్షా'
పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి కులకర్ణి (ప్రథమ)

నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ వలిపే
ఈ సమూహంలో చేరదలచినవారు 89856131235కి మెసేజ్ చేయవచ్చు.

ఏమాయె నా ఊరు

నేను పుట్టి పెరిగిన ఊరు
ఏమాయె నా ఊరు
రచ్చబండ మీద తీర్పు లేని ఊరు
మట్టి వాసన లేక మాగిపోయె నా ఊరు.
ఇక్కడే ఉండేది పెద్ద
తలుపుల లోపల, రెక్కల టీవీ
రెక్కలు గట్టుకొనొచ్చి ,
దుమ్ముల నిలబడి చూసేది నిక్కి నిక్కి
ఏగాలికెగిరి పోయెనో చల్లటి తాటాకు గుడిసెలు
ఏవానకు కూలెనో అక్కడక్కడి పెంకుటిల్లులు
ఉన్నొక్క మిద్దిల్లు, సుద్దలా కూలెనేమో
ఆ వెనుకనే వెలిసె పక్కా ఇండ్లన్ని, యిప్పుడు.
చేద బాయిల లోతు కానమే ఎపుడు
బోరింగుల కాడ గాజుల లొల్లేది
చెయ్యి పట్టుకపోయె చెప్రాసి లేడిపుడు
కాన్వెంట్ లకు గొనిపోయె క్యాబ్ డ్రైవర్లే ఎక్కువ.
ఇంటి వెనుక పెరడు ఎండి పోయిందెపుడో
ఇంటి ముందు కళ్ళాపి కానరాదే నేడు
బర్ల దొడ్డి వాసన లేదు
(ద్వితీయ)
బాతకినీ కొట్టుడు లేదు
తోటజెట్ల తోపలు లేవు
పాణాది బాటలు లేవు
పాలు పెరుగు గంపలు లేవు
ఎడ్ల బండ్ల జోరులు లేవు
పాలిచ్చే ఆవులు తప్ప
లేత, ముదురు కోడె దూడలు లేవు
క్రికెట్ తప్ప కోతి కొమ్మచ్చి ఆటలు లేవు,
పచ్చీసు వనగుంటలేమాయె
సెల్లు ఫోన్లల్ల గేములే ఇపుడు
అరుగులు మూగబోయినవయి
అమ్మలక్కల ముచ్చట లేక
తలుపులు మూతపడినయి
టీవీ సీరియల్ల బారులకు
బోసిబోయిన ఛత్రసాల భవంతులు
వెక్కిరించిన సింగిల్ బెడ్రూములు
ఏ యింట్ల చూసినా ఇద్దరే
లింగీ, లింగడు



-ప్రసూన బిళ్ళకంటి
హైదరాబాద్

జ్ఞాపకాల నీడలు

మరవలేని మధురానుభూతుల
కమ్మనైన పల్లె జీవితం,
జ్ఞాపకాల ఇంటి
ముందుచల్లని తాటాకు పందిరి,
పెరట్లో ఎడ్ల చావిడి,కుడితి గోలెం,
గడ్డివాము కనుమరుగై కలలో
కూడా కరువాయే.
చేను కాడ మోటబాయి
పొద్దున్నే మోటా కొట్టుడు
ఎటుపాయే కరెంటు ఇంజన్ వచ్చి
శ్రమజీవుల శ్రమను తగ్గించి,
ఆవి ఇపుడు మ్యూజియంలో బొమ్మలాయే.
పక్క చేనులో దొంగతనంగా
పచ్చగడ్డి కొసుకున్నపుడు
సరోజనక్క తిట్లు జ్ఞాపకం.
బ్యారెలను మందల కాడికి
తోలుకొని పోతుంటే మా
ఊరి చెరువు కట్ట అంతా
ఉరికించిన జ్ఞాపకం.
సాయంత్రం అమ్మకోసం
సన్నజాజి పందిరి ఎక్కి
పూలు కోసిన జ్ఞాపకం.
అమ్మమ్మ వచ్చినపుడు
బయట మంచాలు
వేసుకొని పడుకున్నప్పుడు
అమ్మమ్మ చెప్పిన ఒంటి స్తంభం
రాజకుమారి వడువకుండ
చెప్పిన జ్ఞాపకం.
మంచి మంచి మధురమైన
మమతలు పంచిన కోమటి
పెద్దమ్మ నేర్పిన సకినాలు
జ్ఞాపకం.
ఈ జ్ఞాపకాలన్నీ గ్లోబలైజేషన్
ప్రభావంతో మాటు
మాయమయే.

-ఫర్జానా

తెలంగాణ యాస, భాషని ప్రస్ఫుటింపజేసి నిఘంటువును తీసుకొస్తాం

తెలంగాణ యాస, భాషని ప్రస్ఫుటింపజేసే విధంగా నిఘంటువును తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వయోధిక పాత్రికేయ సంఘం అధ్యక్షుడు జి.ఎన్. వరదాచారి అధ్యక్షతన గ్రంథ పరిచయ సభ జరిగింది. ఈ సందర్భంగా జూలూరీ మాట్లాడుతూ అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ నిఘంటువును తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామని, దీని కోసం ఒక కమిటీ కూడా ఏర్పాట్లు చేయబోతున్నట్లు తెలిపారు. ఇందులో జర్నలిజానికి సంబంధించిన పదకోశాన్ని చేర్చనున్నామని, తెలుగు భాషను పరిరక్షించుకోవాలనే కాంక్ష ఉన్న ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి సంచాలకులు కె. శివారెడ్డి మాట్లాడారు. సీనియర్ పాత్రికేయులు జి. కృష్ణ రాసిన 'కన్నవీ విన్నవీ' పుస్తకాన్ని పరిచయం చేయగా, సీనియర్ సంపాదకులు గోరా శాస్త్రి 'శతజయంతి సదస్సు ప్రసంగ వ్యాసాల సంఘం' పుస్తకాన్ని సీనియర్ పాత్రికేయులు రెంటాల జయదేవ పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం